# భద్రాచలం ఏరియా ఆసుపత్రికి 'రోగం'.. ఎవరు చేస్తారు చికిత్స?




TGTEL/26/A2635

వాస్తవాలు పలుకు

DD9 వార్త

తెలుగు దినపత్రిక





హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 53 | 05-07-2026 ఆదివారం | పేజీలు: 08 | వెల: 3/-

## ఆహార కల్తీపై హెచ్‌ఫాస్ట్ ఉక్కుపాదం

**100 రోజుల్లో 185 కేసులు**
**122 టన్నుల కల్తీ ఫుడ్ సీజ్**
**వరుసగా మెరుపు దాడులు**
**టన్నుల కొద్దీ సామాగ్రి సీజ్**
**రాజేంద్రనగర్, గోల్కొండ అధిక కేసులు**
**మార్కెట్లో భారీగా నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్**
**కుళ్లిన చికెన్, మాంసం వ్యర్థాల గుట్టురట్టు**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**
హైదరాబాద్ నగర ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న ఆహార కల్తీ మాఫియాపై టాస్క్‌ఫోర్స్ విభాగం 'హెచ్‌ఫాస్ట్' ఉక్కుపాదం మోపింది. నగరంలోని వివిధ హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, తయారీ కేంద్రాలపై అధికారులు నిరంతరం దాడులు చేస్తూ కల్తీరాయుళ్ల గుండెల్లో మిగతా 2లో..




## కల్వకుంట్ల కవితకు ఈసీ నోటీసులు




**'తెలంగాణ రక్షణ సేన' పేరు మార్చాల్సిందే**
**కొత్త పార్టీ పేరుపై ఈసీ అభ్యంతరం**
**15 రోజుల్లో ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలి**
**పాత 'టీఆర్ఎస్' సెంటిమెంట్ వెనుక కథ**
**బీఆర్ఎస్ వైఫల్యం.. కవిత కొత్త వ్యూహం**
**ఓటర్లలో గందరగోళం నెలకొనే అవకాశం**
**ఈసీకి కవిత రాసిన వివరణ లేఖలు**
**న్యాయపోరాటానికి సిద్ధమైన కవిత**

# మిడ్జిల్ ప్రజల ఆశీర్వాదమే నన్ను సీఎంను చేసింది

**మిడ్జిల్‌లో 20 ఏళ్ల రాజకీయ ప్రయాణానికి కృతజ్ఞత సభ**
**2006లో జడ్పీటీసీగా గెలిపించిన ప్రజలకు సీఎం కృతజ్ఞతలు**
**మిడ్జిల్‌ను దత్తత తీసుకోవాలని భట్టి విక్రమార్కకు విజ్ఞప్తి**
**కులగణనతో దేశానికే తెలంగాణ దిక్సూచిగా నిలిచిందన్న సీఎం**
**దొర అహంకారాన్ని మరోసారి ప్రజలు బొందపెట్టాలని పిలుపు**
**ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని వ్యాఖ్య**
**పదేళ్లలో కేసీఆర్ ఇచ్చిన హామీలేవీ నెరవేరలేదని విమర్శ**
**డబుల్ బెడ్‌రూమ్, మూడెకరాల భూమి, ఉద్యోగాలపై ప్రశ్నల వర్షం**
**కేసీఆర్ కుటుంబ ఆస్తులపై సమాధానం చెప్పాలని డిమాండ్**
**ప్రజాపాలన కొనసాగాలంటే కాంగ్రెస్‌ను ఆశీర్వదించాలని విజ్ఞప్తి**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ఆనాడు మిడ్జిల్ మండల ప్రజలు నాటిన మొక్క ఇవాళ మహా వృక్షంగా ఎదిగిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. 2006 జులై 4న తొలిసారిగా తనను ప్రజాప్రతినిధిగా ఆశీర్వదించిన మిడ్జిల్ ప్రజల వల్లే నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా నిలిచానని చెప్పారు. తన రాజకీయ జీవితానికి 20 ఏళ్లు పూర్తైన సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా మిడ్జిల్‌లో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభలో ఆయన భావోద్వేగంగా ప్రసంగించారు.
2006లో స్వతంత్ర అభ్యర్థిగా జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీ చేసిన తనను ఈ ప్రాంత ప్రజలు విశ్వసించి గెలిపించారని రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. తాను ఈ నియోజకవర్గానికి చెందినవాడిని కాకపోయినా ప్రజలు చూపిన నమ్మకమే తన రాజకీయ జీవితానికి బలమైన పునాది అయిందన్నారు. మిడ్జిల్, కల్వకుర్తి ప్రాంతాలకు బూర్గుల రామకృష్ణారావు, జైపాల్‌రెడ్డి వంటి గొప్ప నాయకులను ఇచ్చిన చరిత్ర ఉందని కొనియాడారు.
తన రాజకీయ జీవితంలో కీలక పాత్ర పోషించిన మిడ్జిల్ మండలానికి ఏదో ఒక ప్రత్యేక అభివృద్ధి చేయాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం పేర్కొన్నారు. గతంలో డార్క్ మండలంగా పేరున్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మిడ్జిల్‌ను దత్తత తీసుకోవాలని సభ వేదికగా కోరారు.
తాను ఎప్పుడూ పదవిని, అధికారాన్ని దుర్వినియోగం చేయలేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. వందేళ్లుగా దేశంలో జరగని కులగణనను తెలంగాణ ప్రభుత్వం మిగతా 2లో..



# పశ్చిమాసియా ఇంధన సంక్షోభాన్ని విజయవంతంగా ఎదుర్కొన్నాం

**సంక్షోభ సమయంలో ఇంధన దిగుమతులు 26 దేశాల నుంచి 40 దేశాలకు విస్తరణ**
**చమురు కంపెనీలకు రూ.75 వేల కోట్ల నష్టాన్ని ప్రభుత్వమే భరించిందన్న ప్రధాని**
**ప్రజలపై భారం పడకుండా లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకం తగ్గింపు**
**రాజస్థాన్‌లో దేశ తొలి గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ-పెట్రో కెమికల్ కాంప్లెక్స్ ప్రారంభం**
**ప్రపంచంలో నాలుగో అతిపెద్ద రిఫైనింగ్ సామర్థ్యం కలిగిన దేశంగా భారత్**
**బలమైన దౌత్యం, ప్రత్యామ్నాయ దిగుమతులతో సంక్షోభాన్ని అధిగమించామని వెల్లడి**
**భారత్ విఫలమవుతుందని విష ప్రచారం చేసిన వారి అంచనాలు తప్పాయని వ్యాఖ్య**
**ప్రజలను రెచ్చగొట్టే కుట్రలు ఫలించలేదని మోదీ విమర్శ**
**భాజపా ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం కాదని స్పష్టం**
**పనులు పూర్తయ్యే వరకు నిరంతరం కృషి చేస్తామని ప్రధాని హామీ**

**బలోత్రా, (డిడి9 వార్త):**
పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఇంధన సంక్షోభాన్ని భారత్ విజయవంతంగా ఎదుర్కొందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రభుత్వ ముందస్తు ప్రణాళికలు, ఇంధన దిగుమతుల్లో వైవిధ్యం, వివిధ దేశాలతో బలమైన ద్వైపాక్షిక సంబంధాల వల్ల సంక్షోభ ప్రభావాన్ని ప్రజలపై పడకుండా అడ్డుకోగలిగామని చెప్పారు.
రాజస్థాన్‌లోని బలోత్రా జిల్లా పచ్‌పద్రాలో దేశంలోనే తొలి గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీపెట్రో కెమికల్ కాంప్లెక్స్‌ను శనివారం ప్రారంభించిన మోదీ, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభలో ఆయన ప్రసంగించారు.పశ్చిమాసియా సంక్షోభం ప్రారంభానికి ముందు భారత్ 25 నుంచి 26 దేశాల నుంచి ముడి చమురును దిగుమతి చేసుకునేదని, సంక్షోభం తలెత్తిన తర్వాత ఆ సంఖ్యను 40కి పైగా దేశాలకు పెంచామని మోదీ తెలిపారు. ఒకే ప్రాంతంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ వనరులను గుర్తించడం వల్ల దేశానికి ఇంధన సరఫరాలో అంతరాయం కలగలేదన్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఒక్కసారిగా పెరగడంతో ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలో ప్రభుత్వ రంగ చమురు మిగతా 2లో..

# తెలంగాణ... పాక్, శ్రీలంకలా దివాలా తీస్తుంది

**రాష్ట్రాన్ని బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు అప్పుల కుప్పగా మార్చాయన్న సంజయ్**
**రూ. 10 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజలపై రుద్దారని మండిపాటు**
**రాష్ట్రం అభివృద్ధిపథంలో సాగాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని వ్యాఖ్య**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణను అప్పుల కుప్పగా మార్చడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వానికి పెద్ద తేడా లేదు అంటూ కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పరిధిలో ఈరోజు పలు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై మండిపడ్డారు. రాష్ట్ర ఖజానాను లూటీ చేస్తూ ఏకంగా రూ.10 లక్షల కోట్ల మేర అప్పుల భారాన్ని సామాన్యుడి నెత్తిన రుద్దారని దుయ్యబట్టారు. ఈ తరహా మిగతా 2లో..

## పోలీస్ కొలువుల్లో కోతలు తగదు

**నిరుద్యోగులను కాంగ్రెస్ నిలువునా ముంచింది**
**బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ధ్వజం**
**ప్రభుత్వ ప్రకటనపై తీవ్ర ఆగ్రహం**
**20 వేళ ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని వెల్లడి**
**నిరుద్యోగులు పోరాడాలని పిలుపు**
**ఉద్యోగాల కోసం అండగా ఉంటామని హామీ**




**హైదరాబాద్, (డిడి9 వార్త):**
తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రకటనపై రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీస్ పోస్టుల భర్తీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై విపక్షాలు మండిపడుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం కేవలం 5 వేల పోలీస్ ఉద్యోగాల భర్తీకి మాత్రమే అనుమతి ఇవ్వడంపై బీజేపీ శాసనసభాపక్ష (బీజేఎల్పీ) నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలో వేలాది పోస్టులు ఖాళీగా ఉంటే, తక్కువ సంఖ్యలో భర్తీ చేయడం నిరుద్యోగులను వంచించడమేనని ఆయన దుయ్యబట్టారు.తెలంగాణ పోలీస్ శాఖలో సుమారు 5 వేల ఉద్యోగాల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంపై బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ నిర్ణయం నిరుద్యోగ యువతను తీవ్ర నిరాశకు మిగతా 2లో..

## పర్యాటకులకు తీపి కబురు

**నేటి నుంచే పాపికొండల యాత్రలు ప్రారంభం**
**గత నెలలో నిలిచిపోయిన బోటు సేవలు**
**కఠినమైన తనిఖీల తర్వాతే ఈసీ అనుమతులు**
**గండి పోచమ్మ ఆలయం నుంచి 16 బోట్లు సిద్ధం**
**ఉదయం నుంచే ప్యాకేజీ టూర్ ప్రారంభం**
**గోదావరిపై లంచ్..**
**పేరంటపల్లి ఆశ్రమం సందర్శన**



**హైదరాబాద్, (డిడి9 వార్త):**
ప్రకృతి ప్రేమికులకు, పర్యాటకులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అద్భుతమైన తీపి కబురు అందించింది. సాంకేతిక కారణాల వల్ల గత 20 రోజులుగా నిలిచిపోయిన ప్రసిద్ధ పాపికొండల బోటు ప్రయాణాలకు అధికారులు ఎట్టకేలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. నేటి (జూలై 5) నుంచే ఈ విహార యాత్రలు పునఃప్రారంభం కానున్నాయి. తూర్పు కనుమల మధ్య, గోదావరి నది అలల పైన సాగే ఈ అద్భుతమైన జలవిహారం పర్యాటకులకు మళ్లీ అందుబాటులోకి రావడంతో గోదావరి జిల్లాల్లో సందడి నెలకొంది.
గోదావరి నది పాయల మధ్య, ఆకాశాన్ని తాకేలా ఉండే కొండల నడుమ సాగే పాపికొండల టూర్ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక మధుర జ్ఞాపకం. సుమారు మూడు వారాలుగా ఈ బోటు సేవలు నిలిచిపోవడంతో ఎంతోమంది పర్యాటకులు నిరాశకు గురయ్యారు. అయితే, పర్యాటకుల కోరిక మేరకు ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ స్థానిక యంత్రాంగం బోటు సర్వీసులను తిరిగి పునరుద్ధరించాలని నిర్ణయించింది. నేటి నుంచి పర్యాటకులు మళ్లీ ఈ ప్రకృతి సోయగాలను కనులారా వీక్షించవచ్చు.
గత జూన్ 14వ తేదీన గండి పోచమ్మ ఆలయం సమీపంలో దేవీపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రయాణిస్తున్న ఒక పర్యాటక బోటులో హఠాత్తుగా సాంకేతిక లోపం తలెత్తింది. ప్రయాణికుల మిగతా 2లో..

### పశ్చిమాసియా ఇంధన సంక్షోభాన్ని
# విజయవంతంగా ఎదుర్కొన్నాం

మొదటిపేజీ తరువాయి



కంపెనీలకు రూ.75 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని చెప్పారు. అయితే ఆ భారం ప్రజలపై మోపకుండా ప్రభుత్వమే భరించిందన్నారు. సాధారణ ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని కూడా తగ్గించినట్లు గుర్తు చేశారు.
ప్రస్తుతం ప్రపంచంలో నాలుగో అతిపెద్ద చమురు శుద్ధి సామర్థ్యం కలిగిన దేశంగా భారత్ ఎదిగిందని ప్రధాని పేర్కొన్నారు. దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేయడంలో కొత్త రిఫైనరీలు, పెట్రో కెమికల్ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. భారత్ విఫలమవుతుందని కొందరు విష ప్రచారం చేశారని, ప్రజలను రెచ్చగొట్టేందుకు ప్రయత్నాలు కూడా జరిగాయని మోదీ విమర్శించారు. అయితే ప్రజలు వాటిని నమ్మలేదని, దేశం సంక్షోభాన్ని సమర్థంగా ఎదుర్కొనడంతో భారత్‌పై అనుమానాలు వ్యక్తం చేసిన వారు ఇప్పుడు నిరాశ చెందుతున్నారని అన్నారు.
భాజపా ప్రభుత్వాలు కేవలం శంకుస్థాపనలు చేసి వదిలేయవని, ప్రాజెక్టులు పూర్తయ్యే వరకు నిరంతరం పర్యవేక్షిస్తూ అమలు చేస్తాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

# ఆహార కల్తీపై హెచ్‌ఫాస్ట్ ఉక్కుపాదం

మొదటిపేజీ తరువాయి

వణుకు పుట్టిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా రంగంలోకి దిగిన హెచ్‌ఫాస్ట్ బృందాలు గడిచిన కొన్ని నెలల్లోనే రికార్డు స్థాయిలో తనిఖీలు చేపట్టి, భారీగా అక్రమాలను వెలుగులోకి తెచ్చాయి.
నగరవాసుల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేకంగా ఏర్పాటైన 'హెచ్‌ఫాస్ట్' బృందాలు ప్రతిరోజూ పక్కా సమాచారంతో మెరుపు దాడులు నిర్వహిస్తున్నాయి. బడా రెస్టారెంట్ల నుంచి వీధి చివర ఉండే చిన్న చిన్న హోటళ్ల వరకు ఎవరినీ వదలకుండా తనిఖీలు చేస్తున్నారు. కిచెన్ ఏరియాలో పరిశుభ్రత లోపించడం, కుళ్లిన రసాయనాలు వాడటం, కాలం చెల్లిన పదార్థాలతో వంటకాలు సిద్ధం చేయడం వంటి దారుణాలను ఈ దాడుల్లో అధికారులు ప్రత్యక్షంగా గుర్తిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన యాజమాన్యాలపై భారీగా జరిమానాలు విధిస్తూ కేసులు నమోదు చేస్తున్నారు.
మార్చి 19న ప్రారంభమైన ఈ ప్రత్యేక హెచ్‌ఫాస్ట్ దాడుల ప్రస్థానం విజయవంతంగా 100 రోజులు పూర్తి చేసుకుంది. ఈ వంద రోజుల స్వల్ప వ్యవధిలోనే అధికారులు ఏకంగా 185 క్రిమినల్ కేసులను నమోదు చేసి రికార్డు సృష్టించారు. కేవలం కేసులు పెట్టడమే కాకుండా, మానవ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే సుమారు 121.87 టన్నుల కల్తీ, అత్యంత నాణ్యతలేని ఆహార పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశారు. ఈ భారీ రికవరీ నగరంలో కల్తీ ఏ స్థాయిలో పేరుకుపోయిందో స్పష్టం చేస్తోంది.
హెచ్‌ఫాస్ట్ అధికారులు నగరవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ విస్తృతంగా సోదాలు జరిపారు. అయితే అన్ని జోన్లతో పోలిస్తే రాజేంద్రనగర్, గోల్కొండ పరిసర ప్రాంతాల్లో కల్తీ వ్యాపారం జోరుగా సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వంద రోజుల్లో నమోదైన మొత్తం కేసుల్లో అత్యధికంగా ఒక్క రాజేంద్రనగర్ జోన్‌లోనే 55 కేసులు నమోదు కావడం గమనార్హం. ఆ తర్వాత స్థానంలో ఉన్న గోల్కొండ జోన్‌లో అధికారులు 44 కేసులను బుక్ చేశారు. ఈ ప్రాంతాల్లోని పలు గోడౌన్లపై నిఘా ఉంచి అక్రమాలను అడ్డుకున్నారు.
హోటళ్లు, ఇళ్లలో విరివిగా వాడే అల్లం వెల్లుల్లి పేస్ట్‌లో జరుగుతున్న కల్తీని చూసి అధికారులు సైతం దిగ్భ్రాంతి చెందారు. ప్రమాదకర రసాయనాలు, చెక్కపొడి కలిపి తయారు చేస్తున్న దాదాపు 27 టన్నులకు పైగా నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను అధికారులు సీజ్ చేశారు. వీటితో పాటు కృత్రిమంగా, విషపూరిత రసాయనాలతో మగ్గబెట్టిన 25.8 టన్నుల వివిధ రకాల పండ్లను స్వాధీనం చేసుకుని మార్కెట్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఇవి తింటే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
బిర్యానీలు, చికెన్ వంటకాలకు నగరంలో ఉన్న డిమాండ్‌ను కొందరు కేటుగాళ్లు క్యాష్ చేసుకుంటున్నారు. హెచ్‌ఫాస్ట్ దాడుల్లో ఏకంగా 60 టన్నులకు పైగా చికెన్ వ్యర్థాలు (వేస్ట్ మెటీరియల్) పట్టుబడ్డాయి. వీటిని ఇతర ఆహార పదార్థాల తయారీలో వాడుతున్నట్లు తేలింది. దీనితో పాటు నిల్వ ఉంచిన, కుళ్లిన వాసన వస్తున్న 15 టన్నుల నాణ్యతలేని చికెన్, మేక మాంసాన్ని అధికారులు వేర్వేరు చోట్ల స్వాధీనం చేసుకున్నారు. తక్కువ ధరకే వస్తోందని ఇలాంటి మాంసం కొని వినియోగదారుల ప్రాణాల మీదకు తెస్తున్న హోటళ్లపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు.
కేవలం మాంసం, పండ్లే కాకుండా నిత్యావసరాలైన పాల పదార్థాలలోనూ యథేచ్ఛగా కల్తీ సాగుతోంది. ఈ దాడుల్లో భారీ ఎత్తున నకిలీ కోవా, పనీర్, పెరుగు, నెయ్యి, క్రీమ్‌తో పాటు రంగులు కలిపిన కల్తీ టీ పొడి కూడా భారీగా పట్టుబడింది. ప్రజా ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా పరిణమించిన దాదాపు 247 కేసులను తదుపరి కఠిన చర్యల కోసం జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ విభాగానికి హెచ్‌ఫాస్ట్ అధికారులు బదిలీ చేశారు. అలాగే ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా 90 కేసులు, ప్రత్యేకంగా పనీర్ అవుట్‌లెట్లపై 70 కేసులు నమోదయ్యాయి.
ఆహార నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన అధికారులు.. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీల నిర్వాహకులకు కఠినమైన మార్గదర్శకాలను జారీ చేశారు. ప్రతి కేంద్రానికి తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ ఉండాలని, వంటగదిలో ఖచ్చితంగా ఎఫ్ఐఎఫ్ఓ పద్ధతిని పాటించాలని ఆదేశించారు. ఒకసారి వాడిన వంట నూనెను పదే పదే పునర్వినియోగం చేయడంపై (రీయూజ్) తీవ్ర ఆంక్షలు విధించారు. నిబంధనలు మీరితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.
ప్రజల ప్రాణాలతో ఆడుకునే కల్తీ మాఫియాపై అవసరమైతే పీడీ యాక్ట్ ప్రయోగించడానికి కూడా వెనకాడబోమని నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ గట్టి హెచ్చరిక జారీ చేశారు. నగరంలో ప్రతిరోజూ సగటున 15 ఆహార కల్తీ ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన వెల్లడించారు. ఎక్కడైనా నకిలీ, కల్తీ ఆహార పదార్థాల తయారీ లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే తక్షణమే డయల్ 100కు గానీ, లేదా హెచ్‌ఫాస్ట్ ప్రత్యేక వాట్సాప్ మొబైల్ నంబర్ 8712661212కు మెసేజ్ లేదా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# మిడ్జిల్ ప్రజల ఆశీర్వాదమే నన్ను సీఎంను చేసింది

మొదటిపేజీ తరువాయి

విజయవంతంగా నిర్వహించి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. సామాజిక న్యాయం కోసం ఈ ప్రక్రియ ఎంతో కీలకమని చెప్పారు. దొరల అహంకారాన్ని ప్రజలు మరోసారి ఓటుతో బొందపెట్టాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన గద్దర్‌ను గత పాలకులు అవమానించారని ఆరోపించారు. గద్దర్‌ను దొర గడీ ముందు గంటల తరబడి నిలబెట్టారని గుర్తుచేశారు. గత పదేళ్లలో పేదలకు సొంతింటి కల నెరవేరలేదని, ఇప్పుడు తమ ప్రభుత్వం గ్రామ గ్రామాన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో ఆ కలను సాకారం చేస్తోందని తెలిపారు.
ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ, రూ.70 వేల కోట్ల అప్పుతో ఉన్న రాష్ట్రాన్ని గత ప్రభుత్వం రూ.8.50 లక్షల కోట్ల అప్పుల స్థాయికి తీసుకెళ్లిందని ఆరోపించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, మూడెకరాల భూమి, కోటి ఎకరాలకు సాగునీరు, ఇంటికో ఉద్యోగం వంటి హామీల్లో ఏ ఒక్కటీ పూర్తిగా అమలు కాలేదని ప్రశ్నించారు. నేరెళ్ల ఘటనను ప్రస్తావిస్తూ ఇసుక దోపిడీని అడ్డుకున్న దళితులపై లారీలతో దాడులు జరిగాయని విమర్శించారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబ సభ్యులకు, బంధువులకు తప్ప సాధారణ ప్రజలకు ఉద్యోగాలు, పదవులు దక్కాయా అని ప్రశ్నించారు.
కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు పేర్లను ప్రస్తావిస్తూ గజ్వేల్‌లోని వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్, వేల కోట్ల రూపాయల విలువైన భూములు, ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



కేసీఆర్ కుటుంబ దోపిడీలు, అక్రమాలు మళ్లీ ప్రారంభం కావాలా? లేక ప్రజాపాలన కొనసాగాలా? అనే విషయాన్ని ప్రజలే నిర్ణయించాలని ఆయన అన్నారు.
ప్రజల ఆశీర్వాదంతోనే తన రాజకీయ ప్రస్థానం ప్రారంభమైందని, అదే ఆశీర్వాదంతో తెలంగాణ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని రేవంత్‌రెడ్డి సభ ముగింపులో తెలిపారు.

# కల్వకుంట్ల కవితకు ఈసీ నోటీసులు

- 'తెలంగాణ రక్షణ సేన' పేరు మార్చాల్సిందే
- కొత్త పార్టీ పేరుపై ఈసీ అభ్యంతరం
- 15 రోజుల్లో ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలి
- పాత 'టీఆర్ఎస్' సెంటిమెంట్ వెనుక కథ
- బీఆర్ఎస్ వైఫల్యం.. కవిత కొత్త వ్యూహం
- ఓటర్లలో గందరగోళం నెలకొనే అవకాశం
- ఈసీకి కవిత రాసిన వివరణ లేఖలు
- న్యాయపోరాటానికి సిద్ధమైన కవిత

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

కల్వకుంట్ల కవిత నేతృత్వంలో కొత్తగా ఏర్పాటైన 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) గట్టి షాక్ ఇచ్చింది. పార్టీ పేరును మార్చాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ పేరుపై ప్రజల నుంచి, వివిధ వర్గాల నుంచి పెద్ద ఎత్తున అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని ఈసీ తన లేఖలో పేర్కొంది. దీనిపై స్పందించిన కవిత.. తాము చట్టపరంగానే ముందుకెళ్తామని, పేరు మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేయడంతో ఈ వ్యవహారం ఇప్పుడు రాజకీయంగా దుమారం రేపుతోంది.
కల్వకుంట్ల కవిత ఇటీవలే 'తెలంగాణ రక్షణ సేన' అనే రాజకీయ పార్టీని స్థాపించి, దాని రిజిస్ట్రేషన్ కోసం ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఈ పేరుపై కేంద్ర ఎన్నికల సంఘం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ పేరును మార్చాల్సిందేనని కవితకు ఈసీ అధికారికంగా లేఖ రాసింది. పార్టీ పేరు సమాజంలో అయోమయానికి గురిచేసేలా ఉందంటూ వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ వెల్లడించింది.
తెలంగాణ రక్షణ సేన అనే పేరు కాకుండా, మరో మూడు కొత్త పేర్లను ప్రత్యామ్నాయంగా సూచించాలని కవితకు ఎన్నికల సంఘం గడువు విధించింది. ఈ లేఖ అందిన 15 రోజుల్లోగా ఆ మూడు పేర్లను తమకు సమర్పించాలని ఆదేశించింది. ఒకవేళ ఇచ్చిన గడువులోగా ఎలాంటి ప్రత్యామ్నాయ పేర్లను పంపకపోతే, పార్టీ రిజిస్ట్రేషన్ కోసం చేసుకున్న దరఖాస్తును పూర్తిగా క్లోజ్ (మూసివేస్తాం) చేస్తామని ఈసీ గట్టిగా హెచ్చరించింది.
గతంలో కేసీఆర్ నాయకత్వంలో నడిచిన 'తెలంగాణ రాష్ట్ర సమితి' పార్టీని కూడా అందరూ 'టీఆర్ఎస్' అనే పిలిచేవారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ, ఆ తర్వాత రాష్ట్ర ఏర్పాటులోనూ ఈ పేరు ప్రజల గుండెల్లో బలంగా నాటుకుపోయింది. యావత్ దేశవ్యాప్తంగా ఈ పేరు మారుమోగింది. అయితే, జాతీయ రాజకీయాల్లోకి వెళ్లాలనే ఉద్దేశంతో కేసీఆర్ ఆ పేరును 'భారత్ రాష్ట్ర సమితి' గా మార్చారు. ఆ తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయాన్ని చవిచూసింది.
బీఆర్ఎస్‌గా పేరు మార్చడం వల్లే పార్టీ ఓడిపోయిందనే చర్చ తెలంగాణ రాజకీయాల్లో బలంగా నడిచింది. కొత్త పేరులో 'తెలంగాణ' అనే పదం లేకపోవడం వల్ల, తెలంగాణ సెంటిమెంట్ దెబ్బతిందని సొంత పార్టీ నేతలే భావించారు. ఈ నేపథ్యంలోనే కల్వకుంట్ల కవిత మళ్లీ పాత సెంటిమెంట్‌ను తెరపైకి తెస్తూ.. ప్రజల్లోకి వెళ్లేందుకు 'తెలంగాణ రక్షణ సేన' అనే పార్టీని పెట్టారు. ఈ పేరుకు షార్ట్ కట్ కూడా 'టీఆర్ఎస్' అని వచ్చేలా పక్కా వ్యూహంతో ఆమె అడుగులు వేశారు.
కవిత పెట్టిన ఈ కొత్త పార్టీ పేరు పాత టీఆర్ఎస్ పార్టీని, నాటి ఉద్యమ సెంటిమెంట్‌ను గుర్తు చేసేలా ఉందని ఈసీ భావిస్తోంది. దీనివల్ల సామాన్య ఓటర్లలో తీవ్ర గందరగోళం నెలకొనే ప్రమాదం ఉందని ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు అందాయి. ఒకే రకమైన సంక్షిప్త నామం ఉండటం వల్ల ప్రజలు తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందని, అందుకే ఈ పేరును అనుమతించడం కుదరదని ఈసీ తన లేఖలో స్పష్టంగా పొందుపరిచింది.
ఎన్నికల సంఘం ఇచ్చిన నోటీసులపై కల్వకుంట్ల కవిత ఇప్పటికే స్పందించారు. ఈ పేరుపై ఈసీ లేవనెత్తిన అభ్యంతరాలకు సమాధానంగా ఆమె ఇప్పటికే రెండుసార్లు వివరణ ఇస్తూ లేఖలు రాసినట్లు తెలుస్తోంది. తమ పార్టీ పేరు చట్టబద్ధంగానే ఉందని, నిబంధనలకు లోబడే ఈ పేరును ఎంచుకున్నామని ఆమె ఈసీకి వివరించారు. అయినప్పటికీ ఈసీ పదే పదే పేరు మార్చాలని ఒత్తిడి చేయడం సరికాదని ఆమె అభిప్రాయపడ్డారు.
ఎన్నికల సంఘం ఎంత ఒత్తిడి తెచ్చినా పార్టీ పేరును మార్చే ప్రసక్తే లేదని కవిత తేల్చి చెప్పారు. తాము పెట్టిన 'తెలంగాణ రక్షణ సేన' పేరులోనే కొనసాగుతామని స్పష్టం చేశారు. ఈసీ తీసుకున్న ఈ నిర్ణయంపై తాము లీగల్‌గా (న్యాయపరంగా) ముందడుగు వేస్తామని ప్రకటించారు. అవసరమైతే కోర్టును ఆశ్రయించి, తమ పార్టీ పేరును నిలబెట్టుకుంటామని, ఇందుకోసం న్యాయపోరాటానికి కూడా సిద్ధమని కవిత స్పష్టం చేశారు.
కవిత కొత్త పార్టీ పేరు మార్పు వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈసీ గడువు విధించిన 15 రోజుల్లో కవిత ప్రత్యామ్నాయ పేర్లు ఇస్తారా? లేక కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకుంటారా? అనేది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ ఈసీ దరఖాస్తును రద్దు చేస్తే కవిత తదుపరి వ్యూహం ఏంటనేది రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది. ఈ వివాదం రాబోయే రోజుల్లో ఎలాంటి మలుపులు తిరుగుతుందో చూడాలి.

# పోలీస్ కొలువుల్లో కోతలు తగదు

మొదటిపేజీ తరువాయి





గురిచేసిందని ఆయన మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకున్న ఈ అనాలోచిత నిర్ణయంపై ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రభుత్వం తక్షణమే తన నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర పోలీస్ శాఖలో ప్రస్తుతం అధికారికంగా, అనధికారికంగా దాదాపు 20 వేల వరకు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఏలేటి మహేశ్వర్ రెడ్డి గుర్తుచేశారు. ఇంత భారీ సంఖ్యలో పోస్టులు ఖాళీగా ఉంటే, కేవలం 5 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేస్తామనడం వెనుక అంతరార్థం ఏంటని ఆయన నిలదీశారు. మిగిలిన 15 వేల పోస్టుల పరిస్థితి ఏంటని, వాటిని ఎప్పుడు భర్తీ చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏలేటి ఈ సందర్భంగా ప్రస్తావించారు. తాము అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ నేతలు నమ్మబలికారని విమర్శించారు. నిరుద్యోగుల ఆశలను పెట్టుబడిగా పెట్టుకుని, వారి ఓట్లతో అధికార పీఠం దక్కించుకున్న కాంగ్రెస్, ఇప్పుడు ఉద్యోగాల భర్తీలో కోతలు విధిస్తూ తన అసలు నైజం బయటపెట్టుకుందని ధ్వజమెత్తారు.
ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో ఉంటూ, రాత్రింబగళ్లు కష్టపడి చదువుకుంటున్న లక్షలాది మంది పోలీస్ అభ్యర్థుల ఆశలపై ఈ నిర్ణయం నీళ్లు చల్లిందని ఏలేటి ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద సంఖ్యలో నోటిఫికేషన్ వస్తుందని ఆశించిన అభ్యర్థులకు ఈ ఐదు వేల పోస్టుల ప్రకటన పెద్ద శరాఘాతంగా మారిందన్నారు. కాంగ్రెస్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం దేవుని ఎరుగు, ఉన్న ఆశలు కూడా అడుగంటుతున్నాయని ఎద్దేవా చేశారు.
తమకు న్యాయం చేయాలని, ఖాళీల సంఖ్యను పెంచాలని శాంతియుతంగా పోరాటం చేస్తున్న పోలీస్ అభ్యర్థుల పట్ల ప్రభుత్వం అత్యంత అహంకారంగా వ్యవహరిస్తోందని మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలుపుతున్న యువతీ యువకుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి, వారిపై ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. అభ్యర్థులపై అక్రమ కేసులు బనాయించి, అర్ధరాత్రి అరెస్టులు చేయించడం దుర్మార్గమైన చర్య అని ఖండించారు. పోలీస్ ఉద్యోగార్థులు చేస్తున్న న్యాయమైన డిమాండ్లన్నింటికీ భారతీయ జనతా పార్టీ సంపూర్ణంగా మద్దతు ఇస్తుందని ఏలేటి మహేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. నిరుద్యోగులు తమ పోరాటంలో ఒంటరి వాళ్లు కారని, వారికి అండగా నిలబడేందుకు బీజేపీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వ నిర్బంధాలకు భయపడకుండా తమ హక్కుల సాధన కోసం అభ్యర్థులు ముందడుగు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఏలేటి పేర్కొన్నారు. నిరుద్యోగ యువతకు రావాల్సిన న్యాయమైన హక్కులు, ఉద్యోగాలు దక్కేంత వరకు తాము ఎంత దూరమైనా వెళ్తామని హెచ్చరించారు. అసెంబ్లీ లోపల, బయట కూడా నిరుద్యోగుల గొంతుకగా బీజేపీ నిలుస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం దిగివచ్చి పూర్తి స్థాయి ఖాళీలను భర్తీ చేసేలా నోటిఫికేషన్ ఇచ్చేంతవరకు రాజీలేని పోరాటం చేస్తామని ప్రకటించారు. పోలీస్ కొలువుల కోతపై ఏలేటి మహేశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారమే రేపుతున్నాయి. ఒకవైపు నిరుద్యోగుల ఆందోళనలు, మరోవైపు ప్రతిపక్షాల విమర్శలతో రాష్ట్రంలో ఉద్యోగాల కాక రేగుతోంది. ఈ వ్యవహారంపై అధికార కాంగ్రెస్ పార్టీ ఎలా స్పందిస్తుందో, రాబోయే రోజుల్లో నిరుద్యోగుల ఆగ్రహాన్ని చల్లార్చడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

### తెలంగాణ... పాక్, శ్రీలంకలా
# దివాలా తీస్తుంది

మొదటిపేజీ తరువాయి

బాధ్యతారాహిత్యమైన ధోరణి ఇలాగే కొనసాగితే... భవిష్యత్తులో మన రాష్ట్రం కూడా పాకిస్థాన్, శ్రీలంకల మాదిరి దివాలా తీసే దుస్థితికి చేరుకుంటుందని హెచ్చరించారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కి ప్రగతిపథంలో పయనించాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణలో కొనసాగుతున్న ప్రతి చిన్న అభివృద్ధి వెనుక మోదీ సర్కార్ పంపిన నిధులే ఉన్నాయని గుర్తుచేశారు.
పల్లెల ప్రగతి కోసం ఢిల్లీ నుంచి నేరుగా వస్తున్న ఆర్థిక సంఘం నిధులను సైతం ఇక్కడి పాలకులు జీతాల చెల్లింపుల కోసం దారిమళ్లిస్తున్నారని సంజయ్ ఆరోపించారు. కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజాహిత పథకాలపై కోర్టులకెళ్లడం ఏంటని ప్రశ్నించిన ఆయన... వీబీ జీ రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించి శాశ్వత సంపదను సృష్టిస్తుంటే... దానిపై కూడా రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీకి దక్కుతున్న ఆదరణను తట్టుకోలేకనే ప్రతిపక్షాలు ఈర్ష్యతో ఇటువంటి దిగజారుడు చర్యలకు పాల్పడుతున్నాయని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.



# పర్యాటకులకు తీపి కబురు

మొదటిపేజీ తరువాయి

భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే అప్రమత్తమై పాపికొండల బోటు సర్వీసులన్నింటినీ తాత్కాలికంగా నిలిపివేశారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా అన్ని పడవలకు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.
బోట్ల పునరుద్ధరణ కోసం జాయింట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్, రంపచోడవరం ఆర్డీవో స్వాతి నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం క్షేత్రస్థాయిలో భద్రతా ఏర్పాట్లను సమీక్షించింది. జలవనరుల శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ భాస్కర్ ఆధ్వర్యంలో సాంకేతిక నిపుణులు ప్రతి బోటు ఫిట్‌నెస్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. పర్యాటకుల భద్రతకు ఢోకా లేదని నిర్ధారించుకున్న తర్వాతే, నేటి నుంచి బోట్లు నడుపుకోవడానికి అధికారికంగా అనుమతులు మంజూరు చేశారు.
పోలవరం జిల్లా దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ గండి పోచమ్మ అమ్మవారి ఆలయ రేవు నుంచి నేడు బోట్లు ప్రయాణానికి సిద్ధమయ్యాయి. ఇందులో వివిధ ప్రైవేట్ ఆపరేటర్లకు చెందిన 15 లగ్జరీ క్రూయిజ్ బోట్లతో పాటు, ఏపీ టూరిజం శాఖకు చెందిన ఒక ప్రత్యేక బోటు పర్యాటకులను తీసుకెళ్లనున్నాయి. అన్ని బోట్లలోనూ లైఫ్ జాకెట్లు, ప్రథమ చికిత్స కిట్లు మరియు అవసరమైన రక్షణ పరికరాలను అధికారులు సమకూర్చారు. పాపికొండల విహార యాత్ర అంటేనే అంతులేని వినోదం, ఆహ్లాదం. ఉదయం ప్రారంభమయ్యే ఈ ప్రయాణం సుమారు 8 గంటల పాటు సాగుతుంది. గోదావరి అలల పైన ప్రయాణిస్తూ, చుట్టూ ఉన్న దట్టమైన అడవులు, అరుదైన వలస పక్షులు, వృక్ష సంపదను పర్యాటకులు వీక్షించవచ్చు. నది మధ్యలో వెళ్తున్నప్పుడు పడవల్లో డిజె సాంగ్స్, సాంస్కృతిక కార్యక్రమాలతో పర్యాటకులు డ్యాన్సులు చేస్తూ, సెల్ఫీలు దిగుతూ అన్‌లిమిటెడ్ ఎంటర్‌టైన్‌మెంట్ సొంతం చేసుకుంటారు. ఈ టూర్‌కు వెళ్లాలనుకునే పర్యాటకులు ముందుగా రాజమండ్రి చేరుకోవాలి. అక్కడి నుంచి ఉదయం 7:30 గంటలకే ప్రయాణం మొదలవుతుంది. రోడ్డు మార్గం ద్వారా పర్యాటకులను పట్టిసీమ రేవు, పోలవరం రేవు లేదా పురుషోత్తపట్నం రేవుకు తరలిస్తారు. ఉదయం 9:00 గంటలకు బోటు ఎక్కిన తర్వాత పర్యాటకులకు రుచికరమైన అల్పాహారం (టిఫిన్) అందిస్తారు. ఆ తర్వాత 10:30 గంటలకు గండిపోచమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుంటారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గోదావరి నది మధ్యలో ప్రయాణిస్తుండగానే పడవలోనే పర్యాటకులకు రుచికరమైన శాఖాహార భోజనం (లంచ్) వడ్డిస్తారు. మధ్యాహ్నం 2:00 గంటలకు పడవలు పాపికొండల ముఖద్వారానికి చేరుకుంటాయి. ఆ కొండల అందాలను చూశాక, మధ్యాహ్నం 3:00 గంటలకు ఖమ్మం జిల్లా పరిధిలోని పేరంటపల్లి గ్రామానికి బోటు చేరుకుంటుంది. అక్కడ ఉన్న ప్రసిద్ధ రామకృష్ణముని ఆశ్రమం మరియు వీరేశ్వర స్వామి దేవాలయాలను పర్యాటకులు సందర్శిస్తారు.

# నేర నియంత్రణలో పారదర్శకతకు ప్రాధాన్యత : డి.ఐ.జి ఆర్. భాస్కరన్






**నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో శనివారం బాసర జోన్ 2 పరిధిలోని నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ మరియు జగిత్యాల జిల్లాల అధికారులతో డి.ఐ.జి ఆర్. భాస్కరన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శాంతిభద్రతల పరిరక్షణలో ఏమాత్రం అలసత్వం ప్రదర్శించకూడదని, ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన పర్యవేక్షణ ఉండాలని అధికారులను ఆదేశించారు.
ముఖ్యంగా సైబర్ నేరాలను అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగ్గా ఉపయోగించుకోవాలని, మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాల్లో వేగవంతమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు యువతలో అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ స్నేహపూర్వక పోలీసింగ్‌కు ప్రాధాన్యతనివ్వాలని ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి పోలీస్ శాఖపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంపొందించాలని డి.ఐ.జి కోరారు. ఈ సమావేశంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, నిర్మల్ ఎస్.పి డాక్టర్ జి.జానకి షర్మిల, ఆదిలాబాద్ ఎస్.పి అఖిల్ మహాజన్, జగిత్యాల ఎస్.పి అశోక్ కుమార్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## బోధన్ రాజకీయాల్లో ఎంఐఎం తీరుపై బిఆర్ఎస్ ఆగ్రహం

**బోధన్, నిజామాబాద్ జిల్లా 03,జులై (డీడీ9 వార్త) :**

బోధన్ మున్సిపాలిటీలో ఎంఐఎం పార్టీ నాయకులు అవలంబిస్తున్న తీరుపై బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రవీందర్ యాదవ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం బోధన్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ అమీర్ నివాసంలో విలేఖరుల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎంఐఎం కౌన్సిలర్లు, నాయకులు సోషల్ మీడియా వేదికగా వ్యక్తిగత దూషణలకు దిగడం, పార్టీ నిర్ణయాలపై తప్పుడు ప్రచారం చేయడం తగదని హెచ్చరించారు. మున్సిపల్ సమావేశం, కోఆప్షన్ ఎన్నికల సమయంలో తాము బాధ్యతాయుతంగా వ్యవహరించామని కానీ ఎంఐఎం నేతలు అనవసర వివాదాలకు తెరలేపి ప్రజలను పక్కదోవ పట్టిస్తున్నారని రవీందర్ యాదవ్ విమర్శించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని నిధుల విషయంలో నిలదీస్తామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాము ఎటువంటి ఆందోళనలకైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఎంఐఎం నేతలు అభివృద్ధిపై దృష్టి సారించాలని, లేనిపక్షంలో ప్రజలు సరైన గుణపాఠం చెబుతారని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో కౌన్సలర్లు గుమ్ముల అశోక్ రెడ్డి, ముబీన్, అజర్ తదితరులు ఉన్నారు.

## దొడ్డి కొమురయ్య స్ఫూర్తితోనే ప్రజా ఉద్యమాలు

**నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతిని కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన నాయకులు, ఆయన త్యాగాలను స్మరించుకుంటూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా నాయకులు జి. కిషన్, వి. సత్తెవ్వ మాట్లాడుతూ... వెట్టిచాకిరి, బానిసత్వ విముక్తి కోసం, భూమి కోసం జరిగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య అగ్రభాగాన నిలిచిన వీర యోధుడని కొనియాడారు. ఈ ఉద్యమంలో 4 వేల మంది అమరులయ్యారని, 3 వేల గ్రామాలు విముక్తి చెందాయని, 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన గొప్ప చరిత్ర కమ్యూనిస్ట్ ఉద్యమానిదని వారు గుర్తు చేశారు. కొమురయ్య అమరత్వం సాయుధ పోరాటాన్ని మరింత ఉధృతం చేసిందని పేర్కొన్నారు.
ప్రస్తుతం కొందరు మతవాదులు విశాలమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరించి, మత ఘర్షణల పోరాటంగా చిత్రీకరించేందుకు కుట్రలు పన్నుతున్నారని వారు విమర్శించారు. ఇటువంటి కుట్రలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని, దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో బలమైన పోరాటాలను, ఉద్యమాలను నిర్మించడమే ఆయనకు ఇచ్చే అసలైన నివాళి అని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్, మండల నాయకులు అశోక్, బాలకిషన్, బాలయ్య, రాజేశ్వర్, జనార్దన్, రాములు, పవన్ తదితరులు పాల్గొన్నారు.



## బోధన్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట మృతుని కుటుంబీకుల ఆందోళన

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

బోధన్ మండలం నర్సాపూర్ గేట్ వద్ద ఉన్న కల్లు దుకాణంలో కల్లు తాగిన ఓ వ్యక్తి మృతి చెందడం, మరొకరు తీవ్ర అస్వస్థతకు గురికావడంతో నియోజకవర్గంలో తీవ్ర విషాదం అలముకుంది. కల్తీ కల్లు వల్లే తమ వారు మృత్యువాత పడ్డారని ఆరోపిస్తూ మృతుని కుటుంబీకులు శనివారం బోధన్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్పందించిన ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రావు బాధిత కుటుంబీకులను శాంతింపజేస్తూ, ఘటనపై పూర్తిస్థాయి విచారణ చేపట్టి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ ఘటనతో స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది.



## నిజామాబాద్‌లో పేకాట స్థావరంపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

- **10 మంది అరెస్టు**

**నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

నిజామాబాద్ జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలపై నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఉక్కుపాదం మోపుతోంది. నగర పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు ఏసీపీ మస్తాన్ అలీ పర్యవేక్షణలో ప్రత్యేక చీతా ఫోర్స్ బృందం శనివారం నందిపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నూత్‌పల్లి గ్రామం సమీపంలో ఉన్న ఒక గెస్ట్ హౌస్‌పై ఆకస్మిక దాడి నిర్వహించింది. ఈ తనిఖీల్లో పేకాట ఆడుతున్న పది మందిని పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.58,490ల నగదుతో పాటు 10 సెల్‌ఫోన్లు, ఐదు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అదుపులోకి తీసుకున్న నిందితులను, స్వాధీనం చేసుకున్న సొత్తుతో సహా తదుపరి విచారణ నిమిత్తం నందిపేట్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ... కమిషనరేట్ పరిధిలో పేకాట, జూదం, గుట్కా మరియు మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే ప్రజలు తమకు తెలియజేయాలని సమాచారం అందించిన వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. చట్టాన్ని ఉల్లంఘించే ఎవరినైనా ఉపేక్షించేది లేదని, నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



## బస్టాండ్లలో చోరీలకు పాల్పడుతున్న ఘరానా ముఠా గుట్టురట్టు

- **ఆరుగురి అరెస్టు.. రూ. 15 లక్షల సొత్తు స్వాధీనం**

**నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**





బస్టాండ్లలో రద్దీని ఆసరాగా చేసుకుని, బస్సు ఎక్కే వృద్ధురాళ్లే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠా పోలీసులకు చిక్కింది. భైంసాకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు సభ్యులు ఈ ముఠాగా ఏర్పడి వరుస చోరీలకు తెగబడుతున్నారని ఏసీపీ బి.ప్రకాష్ శనివారం వెల్లడించారు. నిందితుల నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 63 గ్రాముల బంగారం, చోరీలకు ఉపయోగించిన రూ.5 లక్షల విలువైన మారుతి ఎర్టిగా కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ నెల 17న నవీపేట్ బస్టాండ్ వద్ద వంకర విజయలక్ష్మి (76) అనే వృద్ధురాలు బస్సు ఎక్కుతుండగా ఈ ముఠా సభ్యులు అత్యంత చాకచక్యంగా ఆమె మెడలోని బంగారు గుండ్ల తాడును కత్తిరించి, మారుతి ఎర్టిగా కారులో భైంసాకు పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో నవీపేట్ పోలీసులు కేసు నమోదు చేసి పక్కా ప్రణాళికతో నిఘా పెట్టారు. తాజాగా చోరీ చేసిన సొత్తును విక్రయించేందుకు నిందితులు నిజామాబాద్‌కు వస్తుండగా పోలీసులు వారిని వలవేసి పట్టుకున్నారు. ఈ ముఠాకు ప్రధాన సూత్రధారిగా భైంసాకు చెందిన ఖతీజా బేగం (67) వ్యవహరిస్తోంది. ఈమె గతంలో కుబీర్, భైంసా, ముధోల్ స్టేషన్ల పరిధిలో పలుమార్లు జైలుకు వెళ్లిన చరిత్ర ఉంది. ఆమెతో పాటు నజ్మా బేగం, షేక్ అస్జద్, అబ్దుల్ జుబైర్, షైక్ వసీం అహ్మెద్, తహేరాలు ఈ ముఠాలో సభ్యులుగా ఉన్నారు. ఇందులో షేక్ అస్జద్‌కు కూడా గతంలో నిజామాబాద్ వన్‌టౌన్ పరిధిలో నేర చరిత్ర ఉంది. నవీపేట్, నిజామాబాద్ టౌన్, నందిపేట పోలీసు స్టేషన్ల పరిధిలో పలు కేసుల్లో వీరు నిందితులుగా ఉన్నారని పోలీసులు నిర్ధారించారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన నవీపేట్ ఎస్సై కె.శ్రీకాంత్, నార్త్ రూరల్ సీఐ బి.శ్రీనివాస్, ఇతర సిబ్బందిని పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రత్యేకంగా అభినందించారు. వృద్ధ మహిళలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్న ఈ ముఠాను పట్టుకోవడం ద్వారా జిల్లాలో చోరీలకు అడ్డుకట్ట పడిందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు.




## బోధన్‌లో హోటళ్లపై మున్సిపల్ అధికారుల దాడులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

బోధన్ పట్టణంలోని పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మున్సిపల్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో పరిశుభ్రత నిబంధనలు పాటించని వ్యాపార సంస్థలపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన గాయత్రి టిఫిన్ సెంటర్, అరోమా హోటల్, గణేష్ ఇడ్లీ సెంటర్, ఏషియన్ బేకరీలకు ఒక్కో సంస్థకు రూ. 500 చొప్పున, బావర్చి హోటల్‌కు రూ.1,000 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ జాదవ్ కృష్ణా మాట్లాడుతూ.. హోటళ్లలో తప్పనిసరిగా పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకం కొనసాగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పట్టణ పరిధిలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండి జూట్ బ్యాగ్‌లను ఎక్కువగా వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు గణేష్, దత్తారావు తదితరులు పాల్గొన్నారు.



## విద్యుత్తులో అంతరాయాలు ఉండకూడదు

- **ఎడపల్లి సబ్ స్టేషన్‌ను సందర్శించిన విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్ రెడ్డి**

**బోధన్, నిజామాబాద్ జులై 04(డీడీ9 వార్త):**

వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును అందించడమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలని విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం ఆయన ఎడపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్‌లో విద్యుత్తు సరఫరా నిర్వహణ, అందుబాటులో ఉన్న పరికరాల పనితీరును స్వయంగా పరిశీలించారు. అనంతరం నిర్వహణ విధానాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా ముందుస్తు జాగ్రత్తలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. వినియోగదారుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి నిరంతరం కృషి చేయాలని అధికారులను కోరారు.



## దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, అమరుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితోనే నేటి ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్ పిలుపునిచ్చారు. శనివారం బోధన్ పట్టణంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద గల పార్టీ జెండా గద్దె వద్ద దొడ్డి కొమురయ్య 80వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి.మల్లేష్ మాట్లాడుతూ... నాడు నైజాం పాలనలో భూస్వాముల అరాచకాలు, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో జరిగిన పోరాటంలో దొడ్డి కొమురయ్య ప్రథమ అమరుడిగా నిలిచారని గుర్తు చేశారు. కడివెండి గ్రామంలో విసునూరు రామచంద్రారెడ్డి గుండాల కాల్పుల్లో కొమురయ్య మృతి చెందడం తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిందని, తద్వారా 3 వేల గ్రామాల్లో పేదలు 10 లక్షల ఎకరాల భూములను భూస్వాముల నుంచి స్వాధీనం చేసుకున్నారని వివరించారు. ప్రస్తుత పాలకులు దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పుతూ దేశద్రోహానికి పాల్పడుతున్నారని మండిపడ్డారు. మట్టి పోరాట స్ఫూర్తితో ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, బి. సాయిలు, గంగారాం, చాంద్, పోశెట్టి లింగం తదితరులు పాల్గొన్నారు.





# అల్లూరి ఆశయాలే యువతకు ఆదర్శం

**బోధన్, నిజామాబాద్ జులై 04(డీడీ9 వార్త):**

బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగించి, మన్యం ప్రజల ఆత్మగౌరవాన్ని కాపాడిన మహోన్నత స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు అని వక్తలు కొనియాడారు. బోధన్ మండలం పెగడపల్లిలో శనివారం అల్లూరి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... అతి పిన్న వయస్సులోనే బ్రిటీష్ పాలనపై ఉక్కుపాదం మోపిన అల్లూరి సీతారామరాజు పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం, స్వాతంత్ర్య కాంక్షతో గెరిల్లా పోరాటం సాగించి ప్రాణత్యాగం చేసిన ఆయన దేశభక్తి వర్ణనాతీతమని చెప్పారు. యువత ఆయన బాటలో నడవాలని, దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మన్యం వీరుని పోరాట తత్వాన్ని నేటి సమాజానికి చాటిచెప్పాల్సిన అవసరం ఉందని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, యువజన సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జైతాపూర్‌లో ఎస్ఐఆర్ నమోదుకు ప్రత్యేక సహాయ కేంద్రం

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం ప్రత్యేక సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. సర్పంచ్ రాజుగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా గ్రామస్తులకు అవసరమైన సలహాలు, సూచనలను అందుబాటులోకి తెచ్చారు. ముఖ్యంగా వృద్ధులు, నిరక్షరాస్యులు ఫారాలు నింపడంలో ఇబ్బందులు పడకుండా సిబ్బంది ప్రత్యేక సహకారం అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ నగేష్, బిఎల్ఓ రహమత్, బిఎన్ఎ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ రికార్డుల ప్రక్షాళన

- **తహశీల్దార్ దత్తాత్రేయ**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

భూ రికార్డులను పక్కాగా రూపొందించేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'భూ భారతి' కార్యక్రమంపై అవగాహన పెంచుకోవాలని తహశీల్దార్ దత్తాత్రేయ గ్రామస్తులకు సూచించారు. శనివారం ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భూ భారతి కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యం, రీ సర్వే విధానం, భూమి హక్కుల నమోదు మరియు సరిహద్దుల నిర్ధారణ వంటి కీలక అంశాల గురించి వివరించారు. భూమికి సంబంధించి ఎటువంటి వివాదాలు లేకుండా, శాస్త్రీయంగా హద్దులను గుర్తించడం ఈ సర్వేలో ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ ప్రక్రియను రైతులందరూ సహకరించి, తమ భూముల వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిరడి జ్యోతి రవికుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# వానాకాలం సీజన్‌ను విజయవంతం చేయండి

- **- అధికారులను ఆదేశించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

రాష్ట్రంలో రానున్న వానాకాలం 2026 సీజన్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు రైతులను సమన్వయం చేసుకుంటూ పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఇతర సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. వ్యవసాయం, విత్తనాలు, ఎరువుల పంపిణీ, ప్రజారోగ్యం, నీటిపారుదల, వాతావరణ మార్పులు, మధ్యాహ్న భోజన పథకం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో 138.49 లక్షల ఎకరాల్లో సాగు లక్ష్యాన్ని నిర్దేశించామని, రైతులకు అవసరమైన మేర 99.13 లక్షల క్వింటాళ్ల విత్తనాలను అందుబాటులో ఉంచామని ఆయన వెల్లడించారు. నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా ఉంచామని, ఇప్పటికే 510.93 క్వింటాళ్ల నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుని, 68 మందిని అరెస్టు చేసి 34 క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. జూలై నెలకు అవసరమైన ఎరువులను ముందస్తుగా నిల్వ ఉంచాలని, యూరియా అక్రమ రవాణా, అధిక ధరలకు విక్రయించే వారిపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు. అదేవిధంగా నానో యూరియా వినియోగాన్ని కూడా విస్తృతంగా ప్రోత్సహించాలని సంజయ్ జాజు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అధికారులు పాల్గొన్నారు.



# గిరిజన ప్రాంతాల అభివృద్ధికి సర్కారు చిత్తశుద్ధి: మంత్రి సీతక్క

- **రూ. 8.42 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనుల శంకుస్థాపన**

**నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**

రాష్ట్రంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం వెంగల్ పాడ్, తిర్మన్‌పల్లి గ్రామాల్లో శనివారం ఆమె రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు.

రాంపూర్ తండా నుంచి వెంగల్‌పాడ్ తండా వరకు రూ. 5.48 కోట్ల వ్యయంతో, కేకే తండా నుండి మెగ్యానాయక్ తండా వరకు రూ. 2.94 కోట్ల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అనంతరం తిర్మన్ పల్లిలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో నూతనంగా నిర్మించిన వసతి గృహ భవన సముదాయం, కిచెన్ మరియు డైనింగ్ హాల్‌ను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ఆమె మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మారుమూల తండాలు, గ్రామాల్లో అభివృద్ధి పనుల్లో పాల్గొనడం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని, విద్యార్థులు ఉన్నత చదువులు చదివి జీవితంలో రాణించాలన్నదే సీఎం ఆశయమని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నియోజకవర్గంలోని గిరిజన తండాలు, వెల్ఫేర్ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. ఏకధాటిగా వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా స్థానిక గిరిజనులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. కళాశాల విద్యార్థినులతో కలిసి మంత్రి సీతక్క సంప్రదాయ గిరిజన నృత్యంలో పాల్గొని ఉత్సాహపరిచారు. అనంతరం మహిళా సంఘాల సభ్యులకు చెక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్ భుజంగ రావు, వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, ఐడీసీఎంఎస్ ఛైర్మన్ తారాచంద్ నాయక్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నగేష్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, సర్పంచ్ చింతల కిషన్ తదితరులు పాల్గొన్నారు.



# హైకోర్ట్ ఆఫ్ తెలంగాణ జస్టిస్ జె.శ్రీనివాస ను కలిసి వినతి పత్రం సమర్పించిన మణుగూరు బార్ అసోసియేషన్ సభ్యులు.

**మణుగూరు.జూలై 4 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు.

హైకోర్ట్ జస్టిస్ జె శ్రీనివాస్ శనివారం నాడు కొత్తగూడెం జిల్లా కోర్టు ను సందర్శించారు.ఈ సందర్భంగా మణుగూరు బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా వారు మణుగూరు కోర్ట్ భవన సముదాయానికి రిటర్నింగ్ వాల్ తో పాటు కోర్టు లో మౌళిక సదుపాయాల కల్పన తదితర పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శ్రీనివాస్ కు సమర్పించారు.

ఈ కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రకాని గురుకృష్ణ,జనరల్ సెక్రటరీ వీర మధుసూదన్,వైస్ ప్రెసిడెంట్ సావిత్రి, సీనియర్ న్యాయవాదులు ఎస్.వి రమణా రెడ్డి,రామ్ మోహన్, గోడిశాల వెంకట రత్నం , నాగార్జున రెడ్డి పాల్గొన్నారు.




# విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

- **సీఎండీ వరుణ్ రెడ్డి**

**బోధన్, నిజామాబాద్ జిల్లా జులై 04(డీడీ9 వార్త):**



విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయడమే ధ్యేయంగా అధికారులు కృషి చేయాలని వరంగల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. శనివారం బోధన్ డివిజన్ పరిధిలోని టౌన్1 సెక్షన్ కార్యాలయం, సబ్‌స్టేషన్, డివిజన్ మరియు ఎలక్ట్రిసిటీ రెవెన్యూ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా వినియోగదారులకు అవగాహన కల్పించాలని, అదే సమయంలో సిబ్బంది తమ విధుల్లో సేఫ్టీ పరికరాలు, ఎర్త్ రాడ్లు, గ్లౌజులు, టెస్టర్లు తప్పనిసరిగా వాడాలని స్పష్టం చేశారు. బోధన్ డివిజన్ సిబ్బంది అందిస్తున్న సేవలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు.




# రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకుడు సీఎం రేవంత్ రెడ్డి

- **భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు**

**భద్రాచలం , జూలై 4 , డిడి9 వార్త**

రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకుడు సీఎం రేవంత్ రెడ్డిని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 20 సంవత్సరాల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా సీఎం రేవంత్ చిత్రపటంకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ జడ్పిటిసి స్థాయి ప్రజాప్రతినిధిగా ప్రారంభమైన రేవంత్ రెడ్డి రాజకీయ ప్రయాణం నేడు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవిని అలంకరించడం ప్రతి కార్యకర్తకు గర్వకారణమని అన్నారు. రెండు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ, ప్రజల విశ్వాసాన్ని సంపాదించి రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకుడని అని కొనియాడారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ముందుండి, తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి నాయకత్వానికి కాంగ్రెస్ శ్రేణులంతా అండగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ , రత్నం రమాకాంత్, కొండిశెట్టి కృష్ణమూర్తి, నర్రా రాము, భీమవరపు వెంకటరెడ్డి, పెద్దినేని శ్రీనివాస్, చింతాడి చిట్టిబాబు, దరపునేని రాంబాబు, మామిడి పుల్లారావు, చింతాడు రామకృష్ణ, బొల్లినేని ధర్మారావు, ఎం. రామచంద్రరావు పాల్గొన్నారు.



# తలసేమియా వ్యాధి పిల్లల కోసం రక్తదానం

**నిజామాబాద్ పొతంగల్/జూలై 04/(డిడి9 వార్త)**

నిజామాబాద్ జిల్లా బ్లడ్ సెంటర్లో తలసే మియా వ్యాధి బారిన పడిన పిల్లల కోసం డాక్టర్. సితాలే రమేష్ ఆధ్వర్యంలో, నరేందర్ స్వచ్ఛందంగా వెళ్లి నిజామాబాద్ బ్లడ్ సెంటర్లో రక్తదానం చేశారు.


డాక్టర్. సితలే రమేష్ మరియు తలెసేమియా వ్యాధి పిల్లల తల్లిదండ్రులు మాట్లాడుతూ నరేందర్ రక్తదానం చేయడం మా జన్మ సుకృతం, అదేవిధంగా డాక్టర్.సితలే రమేష్ మాలాంటి వ్యాధుల బారిన పడిన వాళ్లకు, వెంబడింది మరియు నిరుపేదలకు ఇబ్బందులు ఉందని తెలియగానే, ఎంతోమందికి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం తన వాట్సప్ స్టేటస్ ద్వారా తన వంతు అయిన ఆర్థిక సాయలు చేస్తున్నందుకు డాక్టర్ సితలే రమేష్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు





# దొంగ కరెంటు వాడుకుంటున్న పట్టించుకోని విద్యుత్తు అధికారులు

**నిజామాబాద్ పోతంగల్/ జులై 04/(డిడి9 వార్త):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల పరిధి లోని కొడిచర్ల గ్రామ శివారు నందు గల సర్వే నెంబరు 334/2 బోరు మోటర్లు వేసుకొని రైతు పీరాబోయి డి డి లు కట్టుకొని వ్యవసాయం సాగు చేసుకుంటూ ఉన్నాడు విద్యుత్ డిపార్ట్మెంట్ వారు ట్రాన్స్ఫార్మర్ 2008 లో పెట్టినారు. గత రెండు మూడు సంవత్సరాల నుండి మాగిరి గంగారం, మారుతి దొంగతనంతో ఆ ట్రాన్స్ఫారం పై దొంగ కలెక్షన్లు పెట్టుకుని విద్యుత్ చోరీ చేస్తూ బోరు మోటర్లకు వాడుకుంటున్నారు. ట్రాన్స్ఫారం నుంచి కరెంటు సర్వీస్ వైర్లు భూమిపై నుండి వారి బోరుకు కలెక్షన్ తీసుకున్నారు ఎవరైనా రైతులు గాని కూలీలు గాని మూగజీవులు గాని ఆ కరెంట్ వైర్లకు షాక్ తగిలితే చనిపోతే కూడా విద్యుత్ అధికారులకు పట్టింపు లేదా? నా ట్రాన్స్ఫర్ పై పలన వారు దొంగ కరెంటు వాడుకుంటున్నారని పోతంగల్ సబ్ స్టేషన్ ఏ ఈ కి గత రెండు రోజుల క్రితం రైతు పీరాబోయి దరఖాస్తు ఇవ్వగా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు వెంటనే ఆపై విద్యుత్తు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు ఏడిఈ చర్యలు తీసుకోవాలని దరఖాస్తు ఇవ్వడం జరిగింది రైతు పీరబోయి తెలియజేశారు.





# ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య దొరకు గౌరవ డాక్టరేట్.

- **సామాజిక సేవ, నాయకత్వ రంగాల్లో విశిష్ట సేవలకు అంతర్జాతీయ గుర్తింపు.**

**మణుగూరు.జూలై 4 (డి డి 9వార్త)**

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్, ఆదివాసీ హక్కుల ఉద్యమ నాయకుడు శ్రీ చందా లింగయ్య దొరకు అమెరికాకు చెందిన ప్రతిష్ఠాత్మక యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ (UAU) గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. సామాజిక సేవ మరియు నాయకత్వం (Doctor of Social Service and Leadership) రంగాల్లో ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ యూనివర్సిటీ సెలెక్షన్ కౌన్సిల్ ఈ గౌరవాన్ని ప్రదానం చేయాలని నిర్ణయించింది.

అమెరికాలోని మిస్సోరీ రాష్ట్రం, బేట్స్ సిటీలో ప్రధాన కేంద్రం కలిగిన యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఫర్ లీడర్‌షిప్ అండ్ ఎక్సలెన్స్ ప్రపంచవ్యాప్తంగా సామాజిక సేవ, ప్రజా పరిపాలన, విద్య, నాయకత్వం, మానవతా కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులను గుర్తించి సత్కరించే అంతర్జాతీయ విద్యా సంస్థగా పేరు గాంచింది. విశిష్ట సేవలందించిన నాయకులకు గౌరవ డిగ్రీలను ప్రదానం చేస్తూ ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందింది.

చందా లింగయ్య దొర గిరిజన, ఆదివాసీ, బహుజన వర్గాల హక్కుల కోసం అనేక దశాబ్దాలుగా నిరంతరంగా పోరాడుతూ ప్రజా జీవితంలో విశిష్ట గుర్తింపు పొందారు. ఎమ్మెల్యేగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో గ్రామీణాభివృద్ధి, గిరిజన సంక్షేమం, విద్యా అవకాశాల విస్తరణ, సామాజిక న్యాయం కోసం కృషి చేశారు. ప్రస్తుతం కూడా రాజ్యాంగ పరిరక్షణ, గిరిజన భూహక్కులు, సాంస్కృతిక హక్కులు, సామాజిక సమానత్వం కోసం ఉద్యమిస్తున్నారు.

శనివారం నాడు ఈ గౌరవ డాక్టరేట్ ను పుదుచ్చేరిలో యూనివర్సిటీ కాన్వొకేషన్ కార్యక్రమంలో




చందా లింగయ్య దొర కు అందించింది.

ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ అంతర్జాతీయ గుర్తింపు పట్ల ఆయన అభిమానులు,అనుచరులు,పలువురు ప్రజా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేస్తున్నారు.



## వనమహోత్సవంలో మొక్కల నాటకం

**జనగామ జులై 4(డిడి 9వార్త)బ్యూరో**

లింగాల ఘనపూర్ మండల పరిధిలో నెల్లుట్ల గ్రామం పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి లక్ష్యంగా గ్రామంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింగ రామకృష్ణ జామ, కానుగ, తులసి, తంగేడు తదితర మొక్కలను నాటారు. మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని ఆయన అన్నారు.

కార్యక్రమంలో ఉపసర్పంచ్ దామెర కావ్య ప్రభాకర్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌రాజ్, వార్డు సభ్యులు వేల్పుల శోభారాణి, గొరిగె సందీప్, వీసీడీసీ చైర్మన్ బత్తిని అశోక్‌కుమార్ గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు దామెర నాగరాజ్, గ్రామ నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల అడ్మిషన్లకు అండగా ఎంపీ కడియం కావ్య

**జనగామ జూలై 4(డిడి 9వార్త )బ్యూరో**



స్పాట్ అడ్మిషన్లలో ఒరిజినల్ టీసీ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య తక్షణ సహాయం అందించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధికారులతో మాట్లాడి టీసీ సమర్పణకు గడువు ఇవ్వడంతో పాటు విద్యార్థుల అడ్మిషన్లు కొనసాగేందుకు మార్గం సుగమం చేశారు. దీంతో అడ్మిషన్ కోల్పోయే పరిస్థితి నుంచి విద్యార్థులు బయటపడ్డారు. ఎంపీ స్పందనపై విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



## భద్రాచలంలో జూలై 6న బీసీ ఐక్యవేదిక భారీ బహిరంగసభ

- **జయప్రదం చేయాలని పిలుపునిచ్చిన బీసీ సంఘం నాయకులు**

**భద్రాచలం, జూలై 4 డిడి9 వార్త**

భద్రాచలం పట్టణంలో జూలై 6వ తేదీన నిర్వహించనున్న 'బీసీ ఐక్యవేదిక' ముఖ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని బీసీ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సంబంధించి శనివారం స్థానిక వీరబ్రహ్మం గారి గుడి ఫంక్షన్ హాల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జూలై 6వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు వీరబ్రహ్మం గారి గుడి ఫంక్షన్ హాల్‌లో ఈ ముఖ్య సమావేశం జరుగుతుందని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయి ముఖ్య అతిథులుగా మాజీ ఐపీఎస్ అధికారి, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పూర్ణచందర్ రావు, బీసీ టైమ్స్ అధినేత సంగని సూర్యారావు హాజరుకానున్నారని పేర్కొన్నారు. బీసీల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన దిశగా సాగనున్న ఈ సభకు బీసీ ఐక్యవేదిక నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సన్నాహక సమావేశంలో బీసీ ఐక్యవేదిక నాయకులు బొలిశెట్టి రంగారావు, ప్రధాన కార్యదర్శి బండారు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు అనుగోజు నరసింహాచారి, సహాయ కార్యదర్శి మేకల మల్లుబాబు యాదవ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నిర్మలానందం, పసుపులేటి బాబు ముదిరాజ్, మల్లాడి శ్రీధర్, వెంకటరమణ, వేముల సీతారామ్, ఇజ్జాడ రాంప్రసాద్, బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు..

- **అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన.. సామాజిక కార్యకర్త అంగోత్ మంగీలాల్.**

**మణుగూరు.జూలై 4(డి డి 9వార్త)**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు. మన్యం వీరుడు, ఆదివాసీల ఆరాధ్యదైవం, స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం నాడు మణుగూరు అంబేద్కర్ సెంటర్ సమీపంలో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి సామాజిక కార్యకర్త అంగోత్ మంగీలాల్ పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అంగోత్ మంగీలాల్ మాట్లాడుతూ,

"ఈ దేశంలో ఉన్న యువత మహనీయులని కళ్ళతో చూడకపోవచ్చు గాక. కానీ మన కోసం వారు చేసిన పోరాటాలు మన గుండెలలో నిప్పు రవ్వలై వెదజల్లుతూనే ఉండాలి" అని అన్నారు.

యువతను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... "అల్లూరి 18 ఏళ్లకే తుపాకీ పట్టాడు. 27 ఏళ్లకే అమరుడయ్యాడు. కానీ 100 ఏళ్లు దాటినా ఆయన పేరు చెరిగిపోలేదు. కారణం? ఆయన మాటలకు, చేతలకు పొంతన ఉంది.

నేటి యువత సోషల్ మీడియాలో కామెంట్లు చేయడం కాదు, సమస్య వచ్చినప్పుడు వీధిలోకి రావాలి. అన్యాయం చూసి మౌనంగా ఉండడం అంటే ఆ అన్యాయానికి సహకరించడమే. ఉద్యోగం కోసం, ఉపాధి కోసం, మన హక్కుల కోసం పోరాడే తెగువను అల్లూరి నుండి నేర్చుకోండి. ఫోన్ లో రీల్స్ చూడడం మానేసి, చరిత్ర చదవండి. మన పూర్వీకులు ఇచ్చిన రక్తంతో తడిసిన నేల ఇది. దాన్ని కాపాడుకునే బాధ్యత మనదే" అని పిలుపునిచ్చారు. అల్లూరి సీతారామరాజు 1922లో జరిపిన రంపా తిరుగుబాటు నేటికీ ప్రతి భారతీయుడికి స్ఫూర్తిదాయకమని, అన్యాయంపై పోరాడే తెగువ, స్వాభిమానం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసే తత్వం ఆయన నుండి మనం నేర్చుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్మికులు, యువకులు పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఐ ఎఫ్ టి యు కార్యకర్తలు కే గురుమూర్తి, యు శివరామకృష్ణ, కే నాగేశ్వరరావు, టి రామకృష్ణ, ఎం సాంబశివరావు, ఎం రవి, ఎం గురు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రఘునాథపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడిగా గాదె మహేందర్ రెడ్డి

**జనగామ జూలై 4(డిడి 9వార్త )బ్యూరో**



రఘునాథపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ నాయకుడు గాదె మహేందర్ రెడ్డిని పీసీసీ నియమించింది. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసి కాంగ్రెస్‌కు పూర్వ వైభవం తీసుకురావడమే లక్ష్యమని ఆయన తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానం, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## పేరుకే 30 పడకల సి.హెచ్.సి ఆసుపత్రి..

- **ఒక వైద్యుడుతోనే 200 మంది రోగులకు సేవలు..**
- **మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం విఫలం...**
- **వెంకటాపురం ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన అఖిలభారత తంత్ర మహిళా సంఘం నాయకులు..**

**జూలై04 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలను రెండున్నర సంవత్సరాల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) నుంచి 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)గా అప్‌గ్రేడ్ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆ స్థాయికి తగిన వైద్యులు, సిబ్బంది, మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తిగా విఫలమైందని అఖిలభారత తంత్ర మహిళా సంఘం నాయకులు ఆరోపించారు. శనివారం వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలను పరిశీలించిన అనంతరం వారు మాట్లాడుతూ, మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రతిరోజూ 200 మందికి పైగా రోగులు ఆసుపత్రికి వస్తున్నప్పటికీ, కేవలం ఒక్క వైద్యుడితోనే వైద్య సేవలు అందుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు అవసరమైన గైనకాలజిస్టు, చిన్నారుల కోసం శిశు వైద్య నిపుణులను ఇప్పటివరకు నియమించలేదని, గర్భిణీలకు ప్రసూతి సమయంలో సరిపడా సౌకర్యాలు లేకపోవడంతో ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేయాల్సి వస్తోందని తెలిపారు. దీంతో గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.

అదేవిధంగా ఎక్స్‌రే, ఈసీజీ వంటి ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొన్నారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు విజృంభించే అవకాశం ఉన్నందున ముందస్తుగా అవసరమైన మందులు, వైద్యులు, సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో అఖిలభారత తంత్ర మహిళా సంఘం ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు దేవేంద్ర, జిల్లా కార్యదర్శి నాగలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు సాధన, పెళ్లి దేవి, మజా సుహాసిని, సునారికాని నిర్మల, నిమ్మకంటి స్రవంతి, సినిగిరి సత్యవతి, పుల్లరి యశోద, కురసం శారద, యాలం నాగమణి, రామోజీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిట్యాల సాగర్‌కు ఘన సన్మానం...

**జూలై 04 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ ఆవరణలో నూతనంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన చిట్యాల సాగర్‌కు వెంకటాపురం మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాసం రమేష్ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ, వెంకటాపురం మండలంలో మాదిగలకు రాజకీయ గుర్తింపు కల్పిస్తూ కీలక పదవులు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు. మాదిగలకు అవకాశం కల్పించిన వెంకటాపురం కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, రాష్ట్ర మంత్రి దానసరి సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త డాక్టర్ రాంబాబు, మాజీ ఎంపీటీసీ చిట్యాల అరుణ్ కుమార్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు యాసం మహేష్ మాదిగ, చెన్నం నరసింహారావు మాదిగ, చిట్యాల రవీందర్ మాదిగ, సమ్మాలు మాదిగతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అదనపు కలెక్టర్ నగేష్ కు ఎన్యుమరేషన్ పత్రాల పంపిణీ...

**మెదక్ జూలై 04 (డిడి9 వార్త)**

మెదక్ జిల్లా లో సమగ్ర ఓటరు సవరణ కార్యక్రమంలో భాగంగా మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ కు ఎన్యుమరేషన్ పత్రాలను బిఎల్వోలు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ జిల్లాలో సర్ ప్రక్రియ వేగవంతంగా జరగాలని, ప్రజలందరినీ భాగస్వాములు చేసి, 18 సంవత్సరాలు నిండిన వారిని ఓటర్‌గా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హవేలీ ఘనపూర్ తహసిల్దార్ సింధు రేణుక,తదితరులు పాల్గొన్నారు.



## సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్...

**మెదక్ జూలై 04 (డిడి9 వార్త)**

మెదక్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో వివిధ గ్రూపుల్లో ఖాళీలను భర్తీ కోసం సోమవారం స్పాట్ అడ్మిషన్స్ తీసుకోనున్నట్లు జిల్లా సమన్వయకర్త అనురాధ తెలిపారు. జిల్లాలోని వివిధ వర్గాల విద్యార్థులు వొరిజినల్ సర్టిఫికెట్స్ & జిరాక్స్ తీసుకొని 9:00 వరకు మెదక్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల (గర్ల్స్)కు రావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం పేర్కొన్నారు.





## ప్రాథమిక సహకార సంఘం లో డిజిటల్ సేవలు ప్రారంభం

**చర్ల, జులై 4 (డిడి 9 వార్త)**

చర్ల మండలం కేంద్రంలో శనివారం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్(సీఎస్సీ)ను స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న చిన్న అవసరాలకు పట్టణాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వ సేవలు, ధ్రువపత్రాలు, ఆధార్ సంబంధిత సేవలు, పాన్ కార్డు, ఆదాయ, కుల, నివాస ధ్రువపత్రాల దరఖాస్తులు, విద్యుత్ బిల్లులు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల సేవలు వంటి ఎన్నో డిజిటల్ సేవలు ఇకపై ఈ కామన్ సర్వీస్ సెంటర్ లో ఒకే చోట అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన సేవలు అందించడంలో కామన్ సర్వీస్ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రభుత్వం డిజిటల్ సేవలను గ్రామస్థాయికి తీసుకువెళ్లేందుకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సహకార సంఘాలు ప్రజలకు మరింత చేరువై సేవలు అందించే దిశగా ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన సేవలను ఎమ్మెల్యే పరిశీలించి నిర్వాహకులకు ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు, డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సహకార సంఘం సిబ్బంది, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానానికి రెండు దశాబ్దాలు పూర్తి..

**చర్ల, జూలై 4( డిడి 9 వార్త )**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానంలో రెండు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చర్ల మండల కేంద్రంలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీ కృష్ణ పాల్గొన్నారు. చర్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయ్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ.. జెడ్పీటీసీ సభ్యునిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి తన కృషి, పట్టుదల, ప్రజల పట్ల గల అంకితభావంతో రాష్ట్ర ముఖ్యమంత్రి స్థాయికి ఎదగడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు స్ఫూర్తిదాయకమన్నారు. రాజకీయాల్లో కష్టపడితే ఏ స్థాయికైనా చేరుకోవచ్చని ఆయన నిరూపించారన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, పేదల సంక్షేమాన్ని కేంద్రబిందువుగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, పారదర్శక పాలన, సామాజిక న్యాయం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని, ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు చీమలమర్రి మురళీ కృష్ణ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి రాజకీయ ప్రస్థానం యువతకు ఆదర్శమని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సీఎం రేవంత్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన ప్రజాసేవా ప్రస్థానం మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




## ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

**జవహర్ నగర్, జూలై 4(డీడీ 9 వార్త):**

ఉరివేసుకొని ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

బాలాజీ నగర్ శాంతినగర్ కు చెందిన మృతురాలు మజ్జారి రేఖ(21) కు సుమారు మూడు సంవత్సరాల క్రితం సాయికిరణ్ (ఎక్సైజ్ కానిస్టేబుల్) తో వివాహం జరిగింది. వీరికి ఒక సంవత్సరం వయస్సు గల కుమారుడు ఉన్నాడు. శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంట్లో కుటుంబ సభ్యులు ఎవరూ లేని సమయంలో, ఆమె ఇంటి బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీర కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నది.అనంతరం ఆమె అత్త ఇంటికి వచ్చి చూడగా, రేఖ ఉరివేసుకున్న స్థితిలో కనిపించింది. వెంటనే స్థానిక నివాసితులకు సమాచారం అందించగా, మృతురాలిని అక్కడి నుండి కిందికి దింపి చూడగా రేఖ చనిపోయి ఉంది. పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన



స్థలానికి చేరుకున్న పోలీసులు

సమాచారం అందుకున్న క్లూస్ టీమ్ సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించింది రేఖ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# భద్రాచలం ఏరియా ఆసుపత్రికి 'రోగం'.. ఎవరు చేస్తారు చికిత్స?

- ముఖ్యమంత్రా? లేక జిల్లా మంత్రులా?
- మంత్రులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై సీపీఎం ధర్నా
- వైద్యులు, సిబ్బంది కొరతపై సీపీఎం నిరసన
- సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేత

**భద్రాచలం, జూలై 4 , (డిడి9 వార్త )**

రోగం వస్తే ప్రజలు ఆసుపత్రికి వెళ్తారు.. కానీ, నేడు ఆ ఆసుపత్రికే 'రోగం' పట్టుకుంది. మరి ఆ రోగానికి చికిత్స ముఖ్యమంత్రి చేస్తారా? లేక జిల్లా మంత్రులు చేస్తారా? అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ ప్రభుత్వాన్ని నిలదీశారు. భద్రాచలం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న వైద్యుల కొరత, సిబ్బంది లోపంపై సీపీఎం ఆధ్వర్యంలో శనివారం ఆసుపత్రి ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

**అరకొర సిబ్బందితోనే నెట్టుకొస్తున్న వైనం**

ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ.. 65 మంది వైద్యులు ఉండాల్సిన ఈ ఆసుపత్రిలో కేవలం 18 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని, 55 మంది నర్సింగ్ స్టాఫ్ ఉండాల్సిన చోట కేవలం 20 మందితోనే వైద్య సేవలు అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దులో, ఏజెన్సీ కేంద్రంగా ఉన్న అతి ముఖ్యమైన ఈ ఆసుపత్రి పట్ల ఐఏఎస్ అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. ఐటీడీఏ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించి, వైద్య సిబ్బందిని భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రజా ప్రతినిధుల వైఫల్యం..**

సీపీఎం జిల్లా కార్యదర్శి ఎంబి నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ.. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఏజెన్సీ వైద్యాన్ని గాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే ఆపరేషన్ చేశారని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పాలకులు, ఆసుపత్రి ఈ దుస్థితికి చేరుకోవడానికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత నెలలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ స్వయంగా ఆసుపత్రిని సందర్శించి ముఖ్యమంత్రికి లేఖ రాసినా ఫలితం లేకపోయిందని విమర్శించారు. ఒకప్పుడు నాలుగు రాష్ట్రాల ప్రజలకు సంజీవనిగా నిలిచిన ఈ ఆసుపత్రి, నేడు కనీస వసతులు లేక రోగులను ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఖాళీలను భర్తీ చేయాలని, లేనిపక్షంలో ప్రభుత్వాన్ని దిగ్బంధిస్తామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు, ఎర్రంశెట్టి వెంకటరామారావు, పారిల్లి సంతోష్‌కుమార్, డి.సీతాలక్ష్మి, 20వ వార్డు కౌన్సిలర్ ఇరుప అనసూయ, డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.






## ములుగు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా కోట నరేందర్ నియామకం

**మంగపేట జూలై04డీడీ 9 వార్త**

ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన కార్యవర్గాన్ని జిల్లా నాయకత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా ములుగు జిల్లా కేంద్రంలోని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి అనసూయ (సీతక్క) క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.

సమావేశం అనంతరం ములుగు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టివాడ తిరుపతి ఆధ్వర్యంలో, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటాపురం మండలానికి చెందిన కోట నరేందర్ ని ములుగు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్‌గా నియమించారు. రాష్ట్ర మంత్రి శ్రీమతి సీతక్క చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా, మండల కార్యవర్గాల నియామకాల కోసం ఆసక్తి గల అభ్యర్థుల నుండి దరఖాస్తులను పత్రికా ప్రకటనలు మరియు వాట్సాప్ గ్రూపుల ద్వారా ఆహ్వానించారు. ఆ ప్రకటనకు స్పందించిన కోట నరేందర్ హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ఎస్సీ సెల్ సమావేశంలో పాల్గొని, రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్‌ను కలిసి దరఖాస్తు సమర్పించారు. అనంతరం జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టివాడ తిరుపతి సిఫారసుతో ఎంపిక ప్రక్రియ పూర్తై, ఆయనకు ములుగు జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ పదవి లభించింది.



ఈ సందర్భంగా కోట నరేందర్ తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర మంత్రి దానసరి అనసూయ (సీతక్క) కి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పైడాకుల అశోక్ కి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టివాడ తిరుపతి కి, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కి, అలాగే మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ఎస్సీ వర్గాల సంక్షేమం, సామాజిక న్యాయం మరియు ప్రజాసేవ లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తానని కోట నరేందర్ పేర్కొన్నారు. ఈ నియామకం కోట నరేందర్ సేవలకు గుర్తింపుగా నిలవడంతో పాటు, ములుగు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మరింత బలోపేతం కావడానికి దోహదపడుతుందని పార్టీ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజలకు మరింత చేరువై పార్టీ ఆశయాలను గ్రామస్థాయిలో విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ఏవో....

**మెదక్ జూలై 04 (డీడీ 9 వార్త)**

హవేలీ ఘనపూర్ మండలం రాజ్‌పేట గ్రామంలోని రాజరాజేశ్వరి ఫెర్టిలైజర్ షాపులో బుధవారం ఏఓ బాల్‌రెడ్డి ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని స్టాక్ రిజిస్టర్, స్టాక్ బోర్డు, ఇన్వాయిస్ రికార్డులు, బిల్ బుక్‌లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో బాల్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులను నిర్ణీత ధరలకే విక్రయించాలని, తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని డీలర్‌ను ఆదేశించారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు.



## భక్తిశ్రద్ధలతో చండీ హోమం

**(డీడీ 9 వార్త)మేడ్చల్ :**

సైబరాబాద్ మున్సిపాలిటీ కార్పొరేషన్ పరిధిలోని మేడ్చల్ సర్కిల్ కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కిష్టాపూర్ అర్చన కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా భక్తిశ్రద్ధలతో చండీ హోమంను నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం రెండవ రోజు భాగంగా చండి ఉపాసకులు బ్రహ్మశ్రీ సంజయ శర్మ వైదిక బృందంతో శనివారం ఉదయం 8 గంటల నుండి కర్మణః పుణ్యాహవాచనం ప్రతిష్ట విగ్రహ ఏకాశితి కలశ స్నపనం చండీ హోమము, భారీ ఎత్తున మహిళలు పాల్గొని శ్రీ శ్రీ శ్రీ నల్ల పోచమ్మ అమ్మవారికి దాన్యాదివాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.

సాయంత్రం 4 నుండి స్థాపిత దేవత హోమాలు ప్రతిష్ట దేవత మూలమంత్ర హోమాలు అనంతరం ఫలాదివాసం, పుష్పాదివాసం, శయ్యాధివాసం హారతి మంత్రపుష్పం తీర్థప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. నేటి ఉదయాత్ పూర్వము బ్రాహ్మి ముహూర్తం 3:30గంటల నుండి కర్మణః పుణ్యాహవాచనం, గర్తన్యాసం, బీజన్యాసం, ధాతున్యాసం, 4:50 గంటలకు యంత్రస్థాపన నల్లపోచమ్మ పరివార, విగ్రహాల ప్రతిష్ట ప్రాణప్రతిష్ట దృక్ బలి, దిక్ బలి, పూర్ణాహుతి, కలశ ఉద్వాసన సంప్రోక్షణ, శాంతి కళ్యాణం మహానైవేద్యం హారతి మంత్రపుష్పం ఆశీర్వచనం పండిత సన్మానం మధ్యాహ్నం 12 గంటల నుండి అన్న ప్రసాద సంతర్పణ నిర్వహించబడుతుంది. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ కమిటీ సభ్యులు రెడ్డంగారి నవీన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మున్సిపల్ మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తొంట యాదయ్య, బి జే పి సీనియర్ నాయకులు రాంచంద్రా రెడ్డి లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మహిళలు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ

**జవహర్ నగర్, జూలై 4, (డీడీ 9 వార్త):**

పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాగా మారిందని బీఆర్ఎస్ నాయకుడు సుధాకర్ చారి అన్నాడు. జవహర్ నగర్ చెన్నపురం కు చెందిన శనివారం అనారోగ్యంతో బాధపడుతున్న చిన్న మారయ్య చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే మల్లారెడ్డి కి సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కును దరఖాస్తుదారునికి టిఆర్ఎస్ నేతలు అందజేశారు ఈ కార్యక్రమంలో మహేష్, సంతోష్, ఎల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.



## కోహ్లీ తీసుకున్న ఆ నిర్ణయం నాకు నచ్చలేదు

- విరాట్ కోహ్లీ టెస్ట్ రిటైర్మెంట్‌పై కపిల్ దేవ్ అసంతృప్తి
- కోపం, బాధతోనే కోహ్లీ ఆ నిర్ణయం తీసుకున్నాడని వ్యాఖ్య
- కోహ్లీ తొందరపడి రిటైర్మెంట్ ప్రకటించాడని అభిప్రాయం

**డిడి9 వార్త:**

టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్ రిటైర్మెంట్‌పై భారత క్రికెట్ దిగ్గజం, 1983 ప్రపంచకప్ విజేత కపిల్ దేవ్ విస్మయం వ్యక్తం చేశాడు. కోహ్లీ టెస్ట్ క్రికెట్ వీడ్కోలును చాలా తొందరగా ప్రకటించాడని, బహుశా ఆవేశం లేదా అసహనంతోనే ఆ నిర్ణయం తీసుకుని ఉండొచ్చని అభిప్రాయపడ్డాడు. కపిల్ దేవ్ చేసిన ఈ వ్యాఖ్యలతో కోహ్లీ టెస్ట్ వీడ్కోలు అంశం మరోసారి క్రీడా వర్గాల్లో చర్చనీయాంశమైంది.

2025 మే 12న విరాట్ కోహ్లీ అనూహ్యంగా టెస్ట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. తాజాగా ఒక ఇంటర్వ్యూలో దీనిపై స్పందించిన కపిల్ దేవ్, "విరాట్ టెస్టుల నుంచి రిటైర్ అవ్వడం నాకు సంతోషాన్నివ్వలేదు. తనలోని ఆవేశాన్ని లేదా నిరాశను అధిగమించేందుకు అతడు మరికొంత సమయం తీసుకుని ఉండాల్సింది. అతడిలో ఇంకా ఎంతో క్రికెట్ మిగిలి ఉంది, కానీ అకాల నిర్ణయంతో అర్ధాంతరంగా తప్పుకున్నాడు" అని పేర్కొన్నాడు.

36ఏళ్ల వయసులో కోహ్లీ తన 14ఏళ్ల సుదీర్ఘ టెస్ట్ ప్రయాణానికి స్వస్తి పలికాడు. కెరీర్‌లో మొత్తం 123 టెస్టులు ఆడిన కోహ్లీ... 46.85 సగటుతో 9,230 పరుగులు సాధించాడు. ముఖ్యంగా విదేశీ గడ్డపై భారత్‌కు చారిత్రక విజయాలు అందించడంలో అతడిది కీలక పాత్ర. బోర్డర్‌గవాస్కర్ ట్రోఫీ సమయంలో ఫామ్ లేమితో సతమతమవ్వడం, ఆపై భావోద్వేగపూరితమైన సోషల్ మీడియా పోస్ట్‌తో రిటైర్మెంట్ ప్రకటించడం క్రీడాభిమానులను దిగ్భ్రాంతికి గురిచేసింది. కోహ్లీలోని దూకుడైన స్వభావాన్ని టెన్నిస్ దిగ్గజం జాన్ మెకెన్రోతో పోల్చిన కపిల్, ఆ తీవ్రతే త్వరగా రిటైర్మెంట్ ప్రకటించేలా ప్రేరేపించి ఉండవచ్చని వ్యాఖ్యానించాడు.



## గెలిచినా సంతృప్తి లేదు.. మా ఆటలో చాలా తప్పులున్నాయి

- కేప్‌వెర్డేపై అర్జెంటీనా 3-2తో విజయం
- జట్టు ఆటలో చాలా తప్పులున్నాయని అంగీకరించిన మెస్సీ
- బంతిపై నియంత్రణ కోల్పోయామన్న కెప్టెన్
- ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురాలేకపోయామని అంగీకారం
- నాకౌట్ దశకు ముందు లోపాలను సరిదిద్దుకోవాలన్న స్టార్ ఆటగాడు

**డిడి9 వార్త:**

పసికూన కేప్‌వెర్డేపై అర్జెంటీనా కష్టపడి గెలిచి ఫిఫా ప్రపంచకప్ ప్రీక్వార్టర్స్‌కు చేరడంపై కెప్టెన్ లియోనెల్ మెస్సీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. విజయం సాధించినప్పటికీ జట్టు ఆటలో చాలా లోపాలు కనిపించాయని అన్నాడు. నాకౌట్ దశకు ముందు వాటిని తప్పకుండా సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశాడు.

మయామిలో శనివారం జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో అర్జెంటీనా అదనపు సమయంలో 32తో కేప్‌వెర్డేపై విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు 22తో సమంగా నిలిచాయి. అదనపు సమయంలో మెస్సీ కొట్టిన కార్నర్ ను రొమెరో హెడర్ తో గోల్ గా మలిచే ప్రయత్నం చేయగా... కేప్‌వెర్డే ఆటగాడి చేయికి తగిలిన బంతి గోల్ పోస్ట్ లోకి వెళ్లడంతో అర్జెంటీనా విజయాన్ని అందుకుంది. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్ ప్రీక్వార్టర్స్‌లోకి అడుగుపెట్టింది. తదుపరి మ్యాచ్‌లో ఈజిప్ట్‌తో తలపడనుంది.

మ్యాచ్ అనంతరం మెస్సీ మాట్లాడుతూ.. ''మంచి విషయాలు ఉన్నాయి. అలాగే చాలా తప్పులు కూడా చేశాం. వాటిని సరిదిద్దుకోవాలి. ఇప్పుడు విశ్రాంతి తీసుకుని తర్వాతి మ్యాచ్‌పై దృష్టి పెట్టాలి'' అని చెప్పాడు. మ్యాచ్ ప్రారంభంలో ఆధిక్యం సాధించిన తర్వాత తమ ఆట మెరుగుపడుతుందని భావించామని మెస్సీ తెలిపాడు. కానీ పరిస్థితి పూర్తిగా మారిపోయిందని అన్నాడు. ''మేం బంతిపై నియంత్రణ కోల్పోయాం. ప్రత్యర్థిపై ఒత్తిడి తీసుకురాలేకపోయాం. వారు తమ బలాన్ని ఉపయోగించుకుని మాకు ఇబ్బందులు కలిగించారు'' అని వివరించాడు. కేప్‌వెర్డేను తక్కువ అంచనా వేయలేదని కూడా మెస్సీ స్పష్టం చేశాడు. స్పెయిన్, ఉరుగ్వే వంటి బలమైన జట్లకు లొంగకుండా ఆ జట్టు ఇంతదూరం వచ్చిన విషయాన్ని గుర్తు చేశాడు. నాకౌట్ టోర్నీలో ఏ జట్టూ తేలికగా విజయం ఇవ్వదని పేర్కొన్నాడు. ఈ మ్యాచ్‌లో 29వ నిమిషంలో మెస్సీ గోల్ చేశాడు. దీంతో వరుసగా ఎనిమిది ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో గోల్ చేసిన తొలి ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. టోర్నీలో అర్జెంటీనా ఇప్పటివరకు ఓటమి లేకుండా ముందుకు సాగుతోంది.



## నాన్న ఆ ఒక్క నిర్ణయం తీసుకోకపోతే.. తన కెరీర్ మలుపుపై సంజూ శాంసన్ భావోద్వేగం

- ఢిల్లీ క్రికెట్ జట్టులో చోటు దక్కకపోవడంపై సంజూ శాంసన్ ఆసక్తికర వ్యాఖ్యలు
- ఢిల్లీ జట్టుకు ఎంపిక కాకపోవడంతో తండ్రి వెంటనే కేరళకు మకాం మార్చారని వెల్లడి
- ఆ నిర్ణయమే తన కెరీర్‌కు కీలక మలుపు అని.. కేరళ తరఫున ఆడటం మొదలుపెట్టానని వివరణ
- ఢిల్లీ పోలీస్ క్వార్టర్స్‌లో గల్లీ క్రికెట్‌తో తన ప్రయాణం మొదలైందని గుర్తుచేసుకున్న శాంసన్
- ఫుట్‌బాల్ ప్లేయర్ అయిన తన తండ్రి, తనలోని టాలెంట్ గుర్తించి క్రికెట్ వైపు ప్రోత్సహించారని వెల్లడి

**డిడి9 వార్త:**

టీమిండియా డ్యాషింగ్ బ్యాటర్ సంజూ శాంసన్ తన క్రికెట్ ప్రయాణంలో ఎదుర్కొన్న ఒడిదొడుకులు, తన తండ్రి తీసుకున్న ఓ సాహసోపేత నిర్ణయం తన జీవితాన్ని ఎలా మార్చిందీ వెల్లడించాడు. ఢిల్లీ క్రికెట్ సర్క్యూట్‌లో చోటు కోసం తీవ్రంగా శ్రమించి విఫలమైనప్పుడు, తన తండ్రి విశ్వనాథన్ అప్పటికప్పుడు కుటుంబాన్ని కేరళకు మార్చాలని తీసుకున్న నిర్ణయమే తన కెరీర్‌కు కీలక మలుపు అని గుర్తుచేసుకున్నాడు. జియోస్టార్ నిర్వహించిన 'సూపర్‌స్టార్స్' కార్యక్రమంలో శాంసన్ ఈ ఆసక్తికర విషయాలను పంచుకున్నాడు.

ఢిల్లీలో తన చిన్ననాటి రోజులను గుర్తుచేసుకుంటూ.. "నిజాయతీగా చెప్పాలంటే నా జీవితంలో ఢిల్లీ చాలా పెద్ద పాత్ర పోషించింది. నాన్న ఢిల్లీ పోలీస్ ఫుట్‌బాల్ జట్టులో ఉండేవారు. పోలీస్ క్వార్టర్స్‌లో ఉండటంతో అక్కడి వాతావరణం నన్ను క్రీడల వైపు ఆకర్షించింది. స్నేహితులు డీడీసీఏ జాకెట్లు వేసుకుని రాష్ట్ర జట్టుకు ఆడటం గురించి మాట్లాడుతుంటే, నాకూ ఢిల్లీ తరఫున ఆడాలనే కోరిక కలిగింది. దీని కోసం ట్రయల్స్‌కు వెళ్లాను, స్టేట్ క్యాంపుల్లో పాల్గొన్నాను, పరుగులు కూడా చేశాను" అని శాంసన్ తెలిపాడు.

అయితే, తీవ్రమైన పోటీ కారణంగా తనకు అవకాశం రాలేదని వివరించాడు. "రెండు మూడు సార్లు క్యాంపులకు ఎంపికయ్యాను. కానీ, రాష్ట్ర జట్టులో మాత్రం చోటు దక్కలేదు. ఒకరోజు ట్రయల్స్ ముగిశాక తుది జట్టు జాబితా ప్రకటించారు. అందులో నా పేరు లేదు. మేమంతా మౌనంగా ఇంటికి వచ్చాం. ఇంటికి చేరుకోగానే నాన్న అమ్మతో, 'మనం కేరళకు వెళ్లాలి. సామాన్లు సర్దుకోండి' అన్నారు. అమ్మ ఆశ్చర్యపోయి, 'పిల్లలు ఇంకా 6వ తరగతిలోనే ఉన్నారు. కనీసం 10వ తరగతి పూర్తి చేయనివ్వండి' అంది. కానీ నాన్న, 'లేదు, మనం ఇప్పుడే వెళ్లాలి. మూడు రోజుల్లో టిక్కెట్లు బుక్ చేస్తున్నా' అని తక్షణమే నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత మేమంతా రైలెక్కి కేరళకు చేరుకున్నాం. అలా కేరళ రాష్ట్ర జట్టు తరఫున నా క్రికెట్ ప్రయాణం మొదలైంది" అని శాంసన్ భావోద్వేగంతో చెప్పాడు.

తన తండ్రి ఫుట్‌బాల్ ప్లేయర్ అయినప్పటికీ, తనలోని క్రికెట్ ప్రతిభను గుర్తించి ప్రోత్సహించారని శాంసన్ తెలిపాడు. "నాన్న నన్ను ఫుట్‌బాల్ వైపు ఎప్పుడూ బలవంతం చేయలేదు. నా బ్యాటింగ్ చూసి, 'నీలో టాలెంట్ ఉంది' అని నన్ను, మా అన్నను క్రికెట్ ఆడమని ప్రోత్సహించారు" అని అన్నాడు.

ఫిరోజ్ షా కోట్లా (ప్రస్తుతం అరుణ్ జైట్లీ స్టేడియం) మైదానంతో ముడిపడి ఉన్న ఒక మధుర జ్ఞాపకాన్ని కూడా సంజూ పంచుకున్నాడు. "ఒకరోజు నాన్న నన్ను ప్రాక్టీస్ కోసం ఫిరోజ్ షా కోట్లాకు తీసుకెళతానన్నారు. అక్కడ ఆయనకు డ్యూటీ ఉండటంతో ఒక గంట ప్రాక్టీస్ చేసుకోవడానికి అనుమతి కోరారు. అలా నేను, మా అన్నయ్య, నాన్న కలిసి నెట్స్‌లో గంటసేపు ప్రాక్టీస్ చేశాం. అది దేవుడి ఆశీర్వాదంలా భావిస్తాను. ఆ రోజు నాన్న అది ఎలా మేనేజ్ చేశారో తెలియదు కానీ, అదొక మర్చిపోలేని అనుభూతి" అని సంజూ శాంసన్ తన పాత రోజులను గుర్తుచేసుకున్నాడు.



## దేశమా? కావ్య మారన్ జట్టా?.. పాక్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ సందిగ్ధత!

- దేశం, క్లబ్ మధ్య నలిగిపోతున్న పాక్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్
- వెస్టిండీస్‌తో టెస్ట్ సిరీస్, 'ది హండ్రెడ్' లీగ్ తేదీలు ఒకేసారి రావడంపై గందరగోళం
- భారత ఓనర్ కావ్య మారన్ జట్టుకు రూ. 2.3 కోట్లకు అమ్ముడైన అబ్రార్
- తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొని అబ్రార్‌ను కొనుగోలు చేసిన సన్‌రైజర్స్ లీడ్స్
- పాక్ సెలక్షన్ కమిటీ నిర్ణయంపై ఆధారపడ్డ అబ్రార్ భవితవ్యం

**డిడి9 వార్త:**

పాకిస్థాన్ మిస్టరీ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ తీవ్ర సందిగ్ధంలో చిక్కుకున్నాడు. దేశం తరఫున ఆడాలా? లేక భారీ మొత్తానికి కాంట్రాక్ట్ కుదుర్చుకున్న ఫ్రాంచైజీ లీగ్‌లో పాల్గొనాలా? అనే క్లిష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన పరిస్థితిలో ఉన్నాడు. ఒకవైపు పాకిస్థాన్ జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం, మరోవైపు భారత యజమాని ఆధ్వర్యంలోని జట్టుతో ఉన్న ఆర్థిక ఒప్పందం అతడిని గందరగోళంలో పడేశాయి.

**ఏమిటీ వివాదం?**

పాకిస్థాన్ జట్టు త్వరలో వెస్టిండీస్‌లో రెండు టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. ఈ సిరీస్‌కు అబ్రార్ అహ్మద్‌ను ఎంపిక చేయాలని పాకిస్థాన్ సెలక్షన్ కమిటీ భావిస్తోంది. అయితే, అదే సమయంలో యూకేలో 'ది హండ్రెడ్' లీగ్ జరగనుంది. ఈ లీగ్‌లో సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ అబ్రార్‌ను ఏకంగా 1,90,000 పౌండ్లకు (సుమారు రూ. 2.3 కోట్లు) కొనుగోలు చేసింది. ఈ ఫ్రాంచైజీ యజమాని సన్‌రైజర్స్ హైదరాబాద్ సహయజమాని అయిన కావ్య మారన్.

'ది హండ్రెడ్' లీగ్ జులై 21న ప్రారంభం కానుండగా, వెస్టిండీస్‌తో పాకిస్థాన్ తొలి టెస్టు జులై 25 నుంచి మొదలవుతుంది. ఈ రెండు టోర్నీల తేదీలు దాదాపు ఒకేసారి రావడంతో అబ్రార్ ఏదో ఒకదాన్ని మాత్రమే ఎంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ టెస్ట్ జట్టుకు ఎంపికైతే, అతను 'ది హండ్రెడ్' లీగ్‌కు దూరం కావాల్సి వస్తుంది.

**కావ్య మారన్ నిర్ణయంతోనే అసలు సమస్య**

గతంలో 'ది హండ్రెడ్' వేలంలో కావ్య మారన్ పాకిస్థాన్ ఆటగాడైన అబ్రార్‌ను కొనుగోలు చేయడం పెద్ద వివాదానికి దారితీసింది. 2008 ముంబై దాడుల తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య ద్వైపాక్షిక క్రికెట్ సంబంధాలు తెగిపోయాయి. ఐపీఎల్‌లో కూడా పాక్ ఆటగాళ్లను ఆడించడం లేదు. ఈ నేపథ్యంలో ఒక భారత యజమాని పాక్ ఆటగాడిని, అదీ భారీ ధరకు కొనడంపై సోషల్ మీడియాలో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కావ్య మారన్ జాతీయ భావాలను విస్మరించారని విమర్శలు వచ్చాయి.



అయితే, ఇంగ్లండ్ మరియు వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) 'ది హండ్రెడ్' లీగ్‌లో ఏ దేశ ఆటగాళ్లపైనా వివక్ష చూపకూడదని కఠిన నిబంధన విధించింది. ఈ నిబంధన కారణంగానే భారత ఓనర్లు సైతం పాక్ ఆటగాళ్లను వేలంలో పరిగణనలోకి తీసుకోవాల్సి వచ్చింది. ఇంత వ్యతిరేకతను తట్టుకొని కావ్య మారన్ అతడిని కొనుగోలు చేసినందున, అబ్రార్ కచ్చితంగా లీగ్‌లో ఆడాలని అతని ఏజెంట్ వర్గాలు భావిస్తున్నాయి.

మరోవైపు వెస్టిండీస్ బ్యాటర్లను ఎదుర్కోవడానికి అబ్రార్ లాంటి లెగ్ స్పిన్నర్ జట్టుకు అవసరమని పాక్ సెలక్టర్లు భావిస్తున్నారు. సోమవారం పాకిస్థాన్ టెస్టు జట్టును ప్రకటించనున్నారు. ఆ జట్టులో అబ్రార్‌కు చోటు దక్కితే, 'ది హండ్రెడ్' లీగ్ ఆడేందుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అతనికి నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. దీంతో అబ్రార్ భవిష్యత్తు ఇప్పుడు పీసీబీ చేతుల్లో ఉంది.

## వైభవ్ సూర్యవంశీ అద్భుతాలు చేస్తాడు.. కానీ!: చమిందా వాస్

- వైభవ్ అంతర్జాతీయ స్థాయిలో కచ్చితంగా రాణిస్తాడన్న శ్రీలంక దిగ్గజం
- కానీ అతనిపై అనవసరమైన ఒత్తిడి పెట్టవద్దని కీలక సూచన
- తెలంగాణ టీ20 లీగ్ యువ క్రికెటర్లకు గొప్ప వేదిక అని ప్రశంస
- భారత దేశవాళీ క్రికెట్ వ్యవస్థ ఎంతో పటిష్ఠంగా ఉందని కితాబు

**డిడి9 వార్త:**

భారత క్రికెట్‌లో సంచలనంగా మారిన 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ స్థాయిలో కచ్చితంగా రాణిస్తాడని శ్రీలంక మాజీ ఫాస్ట్ బౌలర్ చమిందా వాస్ విశ్వాసం వ్యక్తం చేశాడు. అయితే, అంత చిన్న వయసులోనే అతనిపై అనవసరమైన అంచనాలు, ఒత్తిడి పెంచవద్దని అభిమానులకు, నిపుణులకు విజ్ఞప్తి చేశాడు. ప్రస్తుతం తెలంగాణ టీ20 లీగ్ (టీజీ20)లో పాలమూరు స్ట్రైకర్స్ జట్టుకు మెంటార్‌గా వ్యవహరిస్తున్న వాస్, 'ఐఏఎన్ఎస్'తో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశాడు.





"భారత్ ఎన్నో ఏళ్లుగా ప్రపంచస్థాయి యువ ప్రతిభావంతులను వెలుగులోకి తెస్తోంది. కొత్త సంచలనం సూర్యవంశీ వయసు చాలా చిన్నది. అతనికి టీమిండియాకు ఆడే అవకాశం వస్తుందని, అద్భుతంగా రాణిస్తాడని నాకు నమ్మకం ఉంది. కానీ, ప్రజలందరినీ నేను కోరేది ఒక్కటే, అతనిపై ఎలాంటి ఒత్తిడి పెట్టొద్దు. అతడిని స్వేచ్ఛగా ఎదగనిస్తే, భారత క్రికెట్‌కు గొప్ప విజయాలు అందిస్తాడు" అని వాస్ వివరించాడు.

ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026లో రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడిన సూర్యవంశీ, 237.30 స్ట్రైక్ రేట్‌తో 776 పరుగులు సాధించి 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్'గా నిలిచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌కు ఎంపికైనప్పటికీ, అంతకుముందు ఐర్లాండ్‌తో సిరీస్‌లో అతనికి ఆడే అవకాశం రాలేదు.తెలంగాణ టీ20 లీగ్ (టీజీ20) నిర్వహణపై వాస్ ప్రశంసలు కురిపించాడు. ఇలాంటి టోర్నమెంట్లు యువ ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నాడు. "హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తొలిసారిగా తెలంగాణ టీ20 లీగ్ నిర్వహించడం యువతకు చాలా మంచిది. అన్ని జట్లలోనూ ఎంతో ప్రతిభ కనిపిస్తోంది. ముఖ్యంగా మా పాలమూరు స్ట్రైకర్స్‌లో కొందరు యువకులు అద్భుతంగా రాణిస్తున్నారు. జట్టుగా మేం రాణించకపోయినా, వ్యక్తిగతంగా కొందరి ప్రదర్శన చాలా బాగుంది" అని తెలిపాడు.

భారత దేశవాళీ క్రికెట్ వ్యవస్థపై కూడా వాస్ తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు. "భారత క్రికెట్ యువత కోసం గొప్ప కార్యక్రమాలు చేస్తోంది. కేవలం హైదరాబాద్‌లోనే కాదు, దేశంలోని ప్రతి రాష్ట్రంలో టీ20 టోర్నమెంట్లు నిర్వహించి యువతకు అవకాశాలు, అనుభవాన్ని అందిస్తున్నారు. చాలా మంది క్రికెటర్లు ఇలాంటి టోర్నీల నుంచే ఐపీఎల్‌లోకి, ఆ తర్వాత జాతీయ జట్టులోకి అడుగుపెట్టారు. యువకులు తర్వాతి స్థాయికి ఎదగడం చూడటానికి సంతోషంగా ఉంది" అని అన్నాడు.



“అమ్మా.. ఇతను ఎవరు?” అంటూ ఓ పిల్లాడు తన తల్లిని అడుగుతున్నాడు. ‘ఒక కథకు ఏం అవసరం.. కచ్చితంగా అందులో ఒక కథానాయకుడు ఉండాలి కదా!.. ఈయనే ఆ హీరో’ అని సమాధానమిచ్చింది తల్లి. ఇంతకీ ఆ హీరో కథేంటి అనేది తెలుసుకోవాలంటే ‘666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్’ సినిమా చూడాల్సిందే. కన్నడ హీరో శివరాజ్‌కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రమిది. ప్రియాంక మోహన్ కథానాయిక. ‘సప్తసాగరాలు దాటి’ ఫేమ్ హేమంత్ ఎం రావు తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ చిత్ర టీజర్‌ను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది ప్రియాంక. “ఆపరేషన్ డ్రీమ్ థియేటర్ ప్రపంచానికి స్వాగతం” అనే వ్యాఖ్యను జోడించింది. 1970 నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా దీన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. డాలీ ధనుంజయ కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రాన్ని వైశాఖ్ గౌడ నిర్మిస్తున్నారు.

# డ్రీమ్ థియేటర్‌కి స్వాగతం

# సిస్టర్ నివేదిత బయోపిక్.. 15 ఏళ్ల తరువాత వెండితెరకు సెలీనా జైట్లీ

బాలీవుడ్ నటి సెలీనా జైట్లీ 5 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత పూర్తిస్థాయి పాత్రలో వెండితెరపై అలరించేందుకు సిద్ధమయ్యారు. చివరిసారిగా ఆమె 2011లో వచ్చిన కన్నడ చిత్రం ‘శ్రీమతి’లో ఉపేంద్ర సరసన కథానాయికగా నటించారు. తాజాగా స్వామి వివేకానంద శిష్యురాలైన సిస్టర్ నివేదిత బయోపిక్(Sister Nivedita biopic)తో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ‘ఏక్ దువా’ లఘు చిత్రంతో జాతీయ పురస్కారం అందుకున్న రామ్‌కమల్ ముఖర్జీ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు.

స్వామి వివేకానంద ఆధ్యాత్మిక జీవితం నుంచి స్ఫూర్తిపొంది, ఆయన బాటలో నడిచిన సిస్టర్ నివేదిత పాత్రను పోషిస్తుండటంపై సెలీనా జైట్లీ ఆనందం వ్యక్తం చేశారు. తన కెరీర్లో ఇదో అర్థవంతమైన చిత్రంగా మిగిలిపోతుందన్నారు. బాల్యంలో తన తల్లి ద్వారా సిస్టర్ నివేదిత సేవల గురించి తెలుసుకున్నానని, ఇప్పుడు తెరపై ఆమె పాత్రలో కనిపించనుండటం మరపురాని అనుభవమని పేర్కొన్నారు. 15 ఏళ్ల పాటు ఐరోపాలో గడిపిన తాను మళ్లీ మూలాలను వెతుక్కుంటూ మాతృదేశానికి తిరిగి వచ్చానని, సనాతన ధర్మంతో అనుసంధానం అయ్యానని సెలీనా అన్నారు.

ఎవరీ సిస్టర్ నివేదిత..?

ఐర్లాండ్‌లో 1867లో జన్మించిన సిస్టర్ నివేదిత అసలు పేరు మార్గరెట్ నోబెల్. 1895లో స్వామి వివేకానంద బోధనలకు ఆకర్షితురాలై భారత్‌కు వచ్చారు. 1898లో వివేకానందుడి శిష్యరికాన్ని స్వీకరించి సిస్టర్ నివేదితగా పేరు మార్చుకున్నారు. ఆధ్యాత్మికవేత్తగా, విద్యావేత్తగా, రచయిత్రిగా ఎంతో మందిని ప్రభావితం చేశారు. 43 ఏళ్ల వయసులో 1911లో కన్నుమూశారు.



# 'బ్లాస్ట్' దర్శకుడితో నాని?



నేచురల్ స్టార్ నాని ఎప్పుడూ స్టార్ దర్శకులతోనే సినిమాలు చేయాలనే ఆలోచనలో ఉండరు. మంచి కథ దొరికితే కొత్త లేదా చిన్న దర్శకులతోనూ పనిచేయడానికి ఆయన ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. తాజాగా నాని మరో క్రేజీ దర్శకుడితో సినిమా చేయనున్నారనే వార్త టాలీవుడ్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. ఇటీవల యాక్షన్ కింగ్ అర్జున్ హీరోగా తెరకెక్కిన తమిళ చిత్రం 'బ్లాస్ట్' మంచి విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో అభిరామి, ప్రీతి ముకుందన్ కీలక పాత్రలు పోషించగా, సుభాష్ కె. రాజ్ దర్శకత్వం వహించారు.

ఈ సినిమా విజయంతో దర్శకుడు సుభాష్‌కు మంచి గుర్తింపు లభించింది. తాజా సమాచారం ప్రకారం, నాని-సుభాష్ కె. రాజ్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వీరిద్దరి మధ్య కథా చర్చలు పూర్తయ్యాయని, సుభాష్ చెప్పిన కథ నానికి నచ్చడంతో ఆయన గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది. అన్నీ అనుకున్నట్లుగా జరిగితే ఈ క్రేజీ కాంబినేషన్‌కు సంబంధించిన అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశాలు ఉన్నాయని సమాచారం.



# ఆ సమయంలో నరకం చూశాను.. వాటితోనే కాలం గడిచింది

యంగ్ బ్యూటీ నభా నటేష్ గురించి ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. 'నన్ను దోచుకుందువటే' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ భామ, తక్కువ సమయంలోనే తన అందం, నటనతో మంచి గుర్తింపు సంపాదించుకుంది. కెరీర్ విజయవంతంగా సాగుతున్న సమయంలోనే ఆమె అనూహ్యంగా కొంతకాలం పాటు సినిమాలకు దూరమైంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నభా, తన కెరీర్ పీక్‌లో ఉన్న సమయంలో ఎందుకు సినిమాలకు విరామం ఇవ్వాల్సి వచ్చిందో వెల్లడించింది. నభా నటేష్ మాట్లాడుతూ.. "కొంతకాలం క్రితం మెట్లపై నుంచి జారి కింద పడిపోయాను. తలకు దెబ్బ తగలకుండా ఉండేందుకు పక్కకు పడటంతో నా పక్కటెముకలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. శరీరంలో రాడ్లు, స్క్రూలు అమర్చాల్సి వచ్చింది. డాక్టర్లు కొంతకాలం పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆ సమయంలో నేను నాలుగు, ఐదు సినిమాల్లో నటిస్తున్నాను. కెరీర్ మంచి దశలో ఉన్న సమయంలో జరిగిన ఈ ప్రమాదం వల్ల సినిమాలకు దూరం కావాల్సి వచ్చింది. ఆ రోజులు నాకు నిజంగా నరకం లాంటివి. అయితే ఆ కష్టకాలాన్ని వృథా చేయకుండా పెయింటింగ్ చేయడం, పాటలు పాడటం, శిల్పకళ (స్కల్ప్టింగ్), పుస్తకాలు చదవడం, ప్రయాణాలు చేయడం వంటి పనులతో గడిపాను. అలాగే కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఎక్కువ సమయం గడపడం వల్ల మానసికంగా, శారీరకంగా మరింత బలంగా మారాను" అని చెప్పుకొచ్చింది. ఇప్పటికే నభా నటేష్ మళ్లీ సినిమాల్లో రీ-ఎంట్రీ ఇచ్చి వరుస అవకాశాలను అందుకుంటోంది. తాజాగా ఆమె నటించిన 'నాగబంధం: ది సీక్రెట్ ట్రెజర్' చిత్రం నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చి ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శించబడుతోంది.




స్టార్ హీరోయిన్ సమంత మరోసారి డిజిటల్ వేదికపైకి వస్తున్నారు. ప్రముఖ ఓటీటీ వేదిక ‘సోనీలివ్ తమిళం’తో చేతులు కలిపినట్లు శనివారం అధికారికంగా ప్రకటించారు. సమంతతో కలిసి పనిచేయడం మొదలైందని, ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే చెబుతామని ‘సోనీలివ్’ వెల్లడించింది. దీనిపై సమంత స్పందిస్తూ, “మార్పును ఆహ్వానించి, ప్రయాణాన్ని నమ్మాలని ఈ ఏడాది నాకు గుర్తుచేసింది. కొత్త ప్రారంభాలకు ఎప్పుడూ స్వాగతం పలకాలి. సోనీలివ్ తమిళంతో ఈ కొత్త అధ్యాయం మొదలుపెట్టడం సంతోషంగా ఉంది. అద్భుతమైన ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నాం. వివరాలు త్వరలోనే మీతో పంచుకుంటా”అని తెలిపారు.

అయితే, సమంతకు OTT వేదిక కొత్తేం కాదు. ఇంతకు ముందే ఆమె పలు వెబ్ సిరీస్‌లు, షోలతో అలరించారు. ‘ది ఫ్యామిలీ మ్యాన్ 2’, ‘సిటడెల్: హనీ బన్నీ’, సామ్‌జామ్, తర్వాత డిజిటల్‌లో ఆమెకు మంచి క్రేజ్ ఉంది. మరి ‘సోనీలివ్’లో సిరీస్ చేస్తారా? లేదా ఏదైనా షోనా?అనే దానిపై స్పష్టత లేదు. కేవలం ‘సోనీలివ్’తో కలిసి పని చేస్తున్నామని మాత్రమే చెప్పారు. ఇక, సమంత నటించిన తాజా చిత్రం ‘మా ఇంటి బంగారం’ జూన్ చివరి వారంలో విడుదలైంది. నందిని రెడ్డి దర్శకత్వంలో వచ్చిన ఈ యాక్షన్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా రూ.85 కోట్లకు పైగా వసూలు చేసింది.

# సమంత కొత్త ప్రయాణం..
## ఆసక్తికర ప్రాజెక్టును ప్రకటించిన నటి

# 'పెద్ది' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తాజాగా నటించిన 'పెద్ది' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకున్న విషయం తెలిసిందే. జూన్ 4న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించి మంచి విజయాన్ని అందుకుంది. థియేటర్లలో మంచి ఆదరణ పొందిన ఈ చిత్రం ఇప్పుడు ఓటీటీలో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. ఈ సినిమా డిజిటల్ హక్కులను నెట్‌ఫ్లిక్స్ సొంతం చేసుకోగా, జూలై 9 నుంచి తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించింది. థియేటర్లలో విజయవంతమైన ఈ చిత్రం ఓటీటీ ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో చూడాలి. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటించగా, బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. జగపతి బాబు, శివరాజ్‌కుమార్ కీలక పాత్రల్లో కనిపించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు.




# ఆ సంస్థ చేతికి 'హృదయం మురళి' తెలుగు థియేట్రికల్ హక్కులు

అథర్వ మురళి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'హృదయం మురళి'. ఈ చిత్రంలో ప్రీతి ముఖుందన్, కాయదు లోహర్, ఫహద్ ఫాజిల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఆకాష్ భాస్కరన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు ఎస్.ఎస్. తమన్ సంగీతం అందించగా, డాన్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ తమిళ చిత్రాన్ని తెలుగులో కూడా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. తెలుగు వెర్షన్‌ను జూలై 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అలాగే, ఈ సినిమా తెలుగు వర్షన్ ను మైత్రి మూవీ మేకర్స్ విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. తెలుగు రాష్ట్రాల్లో మైత్రి సంస్థకు ఉన్న బలమైన పంపిణీ వ్యవస్థ కారణంగా ఈ సినిమాకు మంచి స్థాయిలో థియేటర్లు లభించే అవకాశం ఉంది. ఇక తెలుగు వెర్షన్‌కు మంచి టాక్ వస్తే, బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు నమోదు చేసే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.




This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.